CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 49 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 31 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 49 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 31DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- వైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనాలు
- తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న తెలంగాణ సీఎం
- శ్రీవారి దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించిన అర్చకులు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వైష్ణవ ఆలయాలు వైకుంఠ ఏకాదశి శోభతో వెలిగిపోతున్నాయి. భక్తులు వేకువజామున 2 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలకు తరలివచ్చారు.తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. మొదట వీఐపీలకు వైకుంఠ ద్వారం గుండా శ్రీవారి దర్శనం కల్పించగా, సాధారణ భక్తులకు ఉదయం 6 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వేకువజామునే శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రే తిరుమలకు చేరుకున్న ముఖ్యమంత్రి కుటుంబానికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి సీఎం కుటుంబానికి తీర్థప్రసాదాలు అందజేశారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల గిరులు, ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి.




# జంక్షన్లు జామ్ కావొద్దు

### హైవేల మీద రద్దీపై సర్కార్ స్పెషల్ ఫోకస్.. టోల్ ప్లాజాల దగ్గర వెహికిల్స్ ఆగకుండా చర్యలు

### పండుగ టైంలో రోజుకు లక్ష వాహనాల ప్రయాణం
### సంక్రాంతికి ఊరెళ్లే వారికి ఇబ్బంది రానీయొద్దు
### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి నేపథ్యంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి కోమటిరె డ్డి వెంకట్రెడ్డి సమీక్ష నిర్వహించారు. గతేడాది ఎదురైన అనుభవాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధి కాదులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై దృష్టి పెట్టారని చెప్పారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుంది. దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రేపు నేను తూపాన్సేట్, అబ్దుల్లాపూర్మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్త. మెయిన్ గా ఎల్బీనగర్, వనస్థలిపురం,హయగ్నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ ప్రాంతా ల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఇక్కడ ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాఫిక్ జామ్ కావడానికి వీల్లేదు. పండుగ రద్దీ ఉన్నన్ని రోజుల్లో రోడ్లు మూసేయొద్దు. భారీ యంత్రాలతో పనులు చేపట్టవద్దు. అత్యవసరమైనవి అయితే ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. రోడ్లపై మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలను పూర్తిగా తొ లగించాలి' అని సూచించారు.

**బోర్డులు తప్పనిసరి**

రోడ్డుపనులు జరుగుతున్న ప్రతి చోటా వగలు, రాత్రి స్పష్టంగా కనిపించేలా ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హైవీజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్కు అయోమయం కలిగించేలా ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండి ఆంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల నూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక కన్నిజెంట్ మెరేజ్ మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు అగకుండా వెళ్లేలా అదనపు బృందాలను ఏర్పాటు చేయాలి' అని మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు..



## అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయన్న అమిత్ షా
- పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలన్న మమత
- బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**బెంగాల్ రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారా యి. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో

వివరాలు 2లో..



## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న 'కాండిడా ఆరిస్' ఫంగస్
- చికిత్స అందించినా 50 శాతానికి పైగా మరణాలు
- చర్మంపై ఎక్కువ కాలం ఉంటూ ఇతరులకు వ్యాప్తి
- సాధారణ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించడం కష్టం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరి గిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళ నకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని

వివరాలు 2లో..

## ట్రాన్స్‌జెండర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్: వంద శాతం సబ్సిడీతో రుణాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ట్రాన్స్ జెండర్లకు గుడ్ న్యూస్ చెప్పింది తెలంగాణ సర్కార్. ట్రాన్స్‌జెండర్లు కూడా గౌరవప్రదమైన జీవనం సాగించేలా, ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడేలా భరోసా కల్పిస్తోంది రేవంత్ సర్కార్. ఇందులో భాగంగా 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి గాను ట్రాన్స్‌జెండర్లకు



వివరాలు 2లో..

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్


- అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని
- శాసనమండలి ఉపనేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు
- అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరఫున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు

వివరాలు 2లో..



## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి...
### తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



- పుతిన్ నివాసంపై దాడి వార్తలు కలచివేసాయన్న మోదీ
- శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలు వద్దని హితవు
- 91 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసిందన్న రష్యా
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో కొలిక్కి వస్తున్న శాంతి చర్చలు
- యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అమెరికా అధ్యక్షుడు

**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో

వివరాలు 2లో..

## దుర్గం చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా



- దుర్గం చెరువు ఆక్రమణలకు అద్దం పడుతున్న హైడ్రా విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు
- ఇనార్బిట్ మాల్ వైపు కబ్జా కోరల్లో చిక్కుకున్న 5 ఎకరాల స్థలం స్వాధీనం
- మట్టితో పూడ్చి పార్కింగ్ పేరుతో నెలకు రూ.50 లక్షల దందా చేసిన వైనం
- 160 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు 116 ఎకరాలకు కుంచించుకుపోయిన పరిస్థితి

**హైదరాబాద్ పెన్ పవర్:**చారిత్రక దుర్గం చెరువును కబ్జాదారులు ఎలా కబళించారో కళ్లకు కట్టే సాక్ష్యాలను హైడ్రా (HYDRAA) బయటపెట్టింది. ఒకప్పుడు 160 ఎకరాల విస్తీర్ణంతో అలరారిన ఈ చెరువు, నేడు 116 ఎకరాలకు ఎలా కుంచించుకుపోయిందో వివరిస్తూ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' (NRSC) సహకారంతో శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. దశాబ్దాలుగా సాగిన ఈ ఆక్రమణల పర్వాన్ని

వివరాలు 2లో..

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు
- రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం
- గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.

వివరాలు 2లో..



## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్



- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

**హైదరాబాద్ పెన్ పవర్:**గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పరీక్షల సాగదీత.. విద్యార్థులకు శిక్ష

ఈ మధ్యకాలంలో 10వ తరగతి పరీక్ష విధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులు, ఉపాధ్యాయులులేకాక విద్యావేత్తలలోనూ ఆందోళన కలిగిస్తున్నది. కరోనా కాలంలో పాఠశాల పనిదినాలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడం కోసం తాత్కాలికంగా పాఠ్యాంశాలు తగ్గిస్తూ 11 పేపర్లుగా ఉన్న పదవ తరగతి పరీక్షను ఆరు పేపర్లకి తగ్గించారు. ఈ మార్పు కరోనా కాలంలో సరైనదిగానే భావించిన తర్వాత కాలంలో పాఠ్యాంశాలు కుదింపు చేయకుండా 6 పేపర్ల విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థుల పై మానసిక ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం 7 పరీక్షలను 35 రోజుల సుదీర్ఘ కాలంపాటు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేయడంతో విదార్థుల్లో, ఉపాధ్యాయుల్లో మానసిక ఆందోళన మొదలైంది. ప్రస్తుతమున్న పాఠ్యపుస్తకాలు కరోనా కాలం కన్నా ముందున్న 11 పేపర్లలకు కనుగుణంగా రాయబడ్డాయి. కానీ కరోనా కాలంలో పరీక్షా విధానాన్ని ఆరుపేపర్లకు తాత్కాలికంగా తగ్గించిన తర్వాత పాఠ్యాంశాలు కుదించకుండా తగ్గించిన ఆరు పేపర్ల విధానాన్ని కొనసాగించడంతో విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో ఒత్తిడి పెరిగింది. ఉదా? సాంఘిక శాస్త్రంలో మొత్తం 21 పాఠ్యాంశాలు ఉన్నాయి. వాటికి రెండు పేపర్లతో పరీక్ష విధానం ఉండేది. విద్యార్థులు 1 నుంచి 11 పాఠ్యాంశాలకు మొదటి పేపర్, 12 నుంచి 21 పాఠ్యాంశాలకు రెండో పేపరు పరీక్ష రాసేవారు. ఇది హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఉండేది. అయితే ప్రస్తుతం 21 పాఠ్యాంశాలకు గాను ఒకే సాంఘిక శాస్త్ర పరీక్ష, అందులో 18 ప్రశ్నలు మాత్రమే ఉండడంతో కనీసం ఒక పాఠ్యాంశం నుంచి ఒక ప్రశ్న కూడా లేని విధంగా ప్రశ్నాపత్రం ఉండడంలో శాస్త్రీయత ఉందా? సాంఘిక శాస్త్ర మూల్యాంకనానికి ఒక పేపర్ ఉండాలన్నప్పుడు 21 పాఠ్యాంశాలలో కనీసం ఐదు పాఠ్యాంశాలైన తగ్గించాల్సి ఉండే. ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించాలని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసిన షెడ్యూలు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడం అటు ఉంచితే, మానసిక ఆందోళనను పెంచుతుంది. ఒక సబ్జెక్టులకు 4, 5 రోజుల విరామం కాకుండా ఒకటి, రెండు రోజుల విరామం ఉండాల్సింది. పరీక్షల షెడ్యూలు తయారు చేసే ముందు ఫీల్డ్‌లో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని ఉండాల్సింది. ఏకంగా 35 రోజులపాటు 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తే అన్ని రోజులు పాటు విద్యార్థులు పరీక్షపై దృష్టిని నిలిపి ఉంచలేరూ. ఇది విద్యార్థుల్లో ఒక రకమైన నిరుత్సాహాన్ని పెంచుతుంది. పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి ఉండడంతో, విద్యార్థులు బయట తిరగడం వల్ల అనారోగ్యానికి గురి అయితే, ఇది మొత్తంగా పరీక్షలపై తీవ్ర ప్రభాతం చూపే అవకాశం ఉంటుంది. సిబిఎస్ఇ విధానాన్ని బట్టి పదవ తరగతి షెడ్యూల్ తయారు చేసినట్లు తెలుస్తుంది.

అయితే ఇక్కడ ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సి ఉండే. సిబిఎస్‌సి పాఠ్యాంశాలు చదువుతున్న విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి స్టేట్ సిలబస్ చదువుతున్న విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు. సిబిఎస్ఇలో చదువుతున్న విద్యార్థుల్లో మెజారిటీగా అర్బన్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉంటారు. అందులో తల్లిదండ్రులు అక్షరాసులై ఉంటారు. అదే ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ తదితర సంస్థలలో చదివే విద్యార్థులు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలలో ఉంటారు. తల్లిదండ్రులలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉంటారు. 7 పరీక్షలకు 35 రోజుల టైమ్‌లో మధ్యలో విరామం ఎక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు పనులకు వెళ్ళవలసి రావడంతో చదువుపై దృష్టి కేంద్రకరించలేరు. తల్లిదండ్రులు కూడా అన్ని రోజులు విద్యార్థులపట్ల శ్రద్ధ వహించలేరు, వారికి కావలసిన సౌకర్యాలు అందించలేరు. ఇది మొత్తంగా పరీక్ష ప్రిపరేషన్ విధానాన్నీ దెబ్బతిసే అవకాశం ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ నెల రోజులపాటు పదో తరగతి పరీక్షల్లో నిమగ్నమైతే హోం పరీక్షలపై ప్రభావం పడుతుంది. హోం పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నా, పరీక్షలను గుణాత్మకంగా నిర్వహించాలన్నా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి. 35 రోజులపాటు 10వ తరగతి పరీక్షలు నిర్వహించిన వెంటనే మూల్యాంకనానికి సీనియర్ ఉపాధ్యాయులు వెళ్ళవలసి ఉంటుంది. ఇది 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులను హోం పరీక్షలకు తయారు చేయడంపై ప్రభావం చూపుతుంది. 10వ తరగతి విద్యార్థులను 6, 7, 8, 9, తరగతుల విద్యార్థులను ఒకేసారి పరీక్షలకు సంసిద్ధం చేయలేము. 35 రోజులు పదవ తరగతి విద్యార్థులపై దృష్టి సారించాల్సి రావడం వలన హోం పరీక్షలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. సిబిఎస్‌సి పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల కంటే ముందు హోం పరీక్షలు నిర్వహించి, తర్వాత పదవ తరగతి పరీక్షలు నిర్వహించే వారు, ఈ నిర్వహణలో హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదవ తరగతి పరీక్షలు రెండు దాఫాలుగా నిర్వహిస్తారు. మొదటి దశలో ఫిబ్రవరిలో నిర్వహించి మార్చి, ఏప్రిల్‌లో హోం పరీక్షల్లో నిర్వహిస్తారు. రెండవ దశ పరీక్షలు మే లో నిర్వహిస్తారు. ఈ విధానంలో కూడా హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. అయితే ఎస్ఎస్‌సి బోర్డు షెడ్యూలు ప్రకారం మార్చి 14 న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 16 వరకు సుమారు 35 రోజులు నిర్వహిస్తారు. అదే ఏప్రిల్‌లో హోమ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. రెండు పరీక్షలు ఒకేసారి నిర్వహించాలంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. 10వ తరగతి విద్యార్థులు 35 రోజుల పాటు పరీక్షలు రాస్తే రెసిడెన్షియల్ పాఠశాలలో హోం ఎగ్జామ్స్ రాసే విద్యార్థులపై ఆ ప్రభావం ఉంటుంది. నెల రోజులపాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడం, వారికి పరీక్షలు సక్రమంగా నిర్వహించడం కత్తిమీద సామే అవుతుంది. సుదీర్ఘంగాఉన్న పరీక్షల ప్రస్థానం వల్ల తదుపరి పాలిటెక్నిక్ లాంటి కాంపిటీషన్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఉండకపోవచ్చు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు విద్యార్థులను కార్యోన్ముఖులను చేయలేగాని, కార్యహీనులను చేయరాదు. సంస్కరణలు ఫీల్డ్ స్థాయి సమస్యలను పరిష్కరించేదిగా ఉండాలి కానీ, సమస్యలు సృష్టించేదిగా ఉండకూడదు. సంస్కరణలు స్థానిక సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలే గాని మరో వ్యవస్థను అనుసరించినట్లుగా ఉండకూడదు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అధిక భాగం గ్రామీణ ప్రాంత విద్యార్థులే కాబట్టి ప్రస్తుతం ప్రకటించిన 10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను పునర్ సమీక్షించవలసిందిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్:

# వంద శాతం సబ్సిడీతో రుణాలు..

- మొదటి పేజీ తరువాయి

100 శాతం సబ్సిడీతో రుణాలు అందించేందుకు ముందుకొచ్చింది ప్రభుత్వం. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి రూ.75 వేల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపింది ప్రభుత్వం

ఈ పథకం కింద మంజూరు చేసే రుణాలు పూర్తిగా సబ్సిడీతో కూడుకున్నవి కావడంతో లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదని తెలిపింది ప్రభుత్వం. ఏదైనా రంగంలో నైపుణ్య శిక్షణ పొంది, సొంతంగా చిరు వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ పథకం ద్వారా సాయం అందించనుంది ప్రభుత్వం. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉన్న ట్రాన్స్‌జెండర్లు ఈ పథకానికి అర్హులని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత శాఖ అధికారులు తెలిపారు. ఈ పథకం కింద హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 30స్వయం ఉపాధి యూనిట్లను కేటాయించింది ప్రభుత్వం. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లతో నాంపల్లిలోని మనోరంజన్ కంప్లెక్స్ లో ఉన్న కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు అధికారులు. %ఒఒఒ.ఒఒంఒ.వశ్రీఖఅస్త్రుఖఙ.స్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు అధికారులు. జనవరి 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని.. మరిన్ని వివరాల కోసం 9640452773 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు అధికారులు.

## దుర్గం చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా

- మొదటి పేజీ తరువాయి

ఈ చిత్రాలు స్పష్టంగా బట్టబయలు చేస్తున్నాయి.

గోల్కొండ కోట నివాసులకు దాహార్తిని తీర్చిన ఈ 'సీక్రెట్ లేక్'.. నేడు కబ్జాల చెరలో చిక్కుకుంది. హైడ్రా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 1976 నాటికే దుర్గం చెరువులో 29 ఎకరాలు కబ్జాకు గురై 131.66 ఎకరాలకు తగ్గింది. ఆ తర్వాత 1995 వరకు సురక్షితంగా ఉన్నప్పటికీ, 1995 నుంచి 2000 మధ్య మరో 10 ఎకరాలు అన్యాక్రాంతమై 121 ఎకరాలకు పడిపోయింది. 2000 సంవత్సరం నుంచి నేటి వరకు మరో 5 ఎకరాలు కబ్జా కోరల్లోకి వెళ్లినట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దాదాపు 5 ఎకరాల మేర జరిగిన ఆక్రమణలను హైడ్రా మంగళవారం విజయవంతంగా తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కబ్జాలను నిర్ధారించుకున్నారు. అక్కడ 10 నుంచి 15 మీటర్ల మేర మట్టిని చెరువులో డంప్ చేసి, ఆ స్థలాన్ని చదును చేసి భారీ పార్కింగ్ దందాను నడిపిస్తున్నారు. స్కూల్ బస్సులు, ఐటీ ఉద్యోగుల క్యాబ్‌ల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వాడుతూ, నెలకు దాదాపు రూ.50 లక్షల వరకు అద్దెలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందని, ఆక్రమిత స్థలం తనదేనంటూ సదరు ప్రజాప్రతినిధి క్లైమ్ చేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి భూ రికార్డులు లేకుండానే ఏళ్ల తరబడి ఈ దందా సాగుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణలు అడ్డుగా మారాయి. మంగళవారం జరిగిన ఆపరేషన్‌లో హైడ్రా అధికారులు పార్కింగ్‌లోని వాహనాలను ఖాళీ చేయించి, ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. త్వరలోనే డంప్ చేసిన మట్టిని కూడా తొలగించి చెరువు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు పూర్తి విస్తీర్ణాన్ని పక్కాగా తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది.

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి

హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు. అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయంటూ అమిత్ షా వ్యాఖ్యానించడం పూర్తిగా రాజకీయ ప్రేరితమని మమత మండిపడ్డారు. బెంగాల్‌లోనే ఉగ్రవాదులు ఉంటే, పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలని ఆమె సూటిగా ప్రశ్నించారు. అలాగే, బెంగాల్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మాణం జరగడం లేదన్న అమిత్ షా వ్యాఖ్యలను కూడా మమత తీవ్రంగా ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంవల్లే అనేక రైల్వే ప్రాజెక్టులు బెంగాల్‌కు వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ నేతలు కావాలనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటి మాటలను బెంగాల్ ప్రజలు ఎప్పటికీ నమ్మరని మమత స్పష్టం చేశారు. ఇక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర పన్నుతోందని మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఇంత హడావిడిగా ఎందుకు చేపడుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక పలువురు బూత్ లెవల్ అధికారులు, ఇతర సిబ్బంది మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో సుమారు 1.5 కోట్ల మంది పేర్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని మమత ఆరోపించారు. ముఖ్యంగా ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియను నడుపుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఇలాంటి చర్యలను తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, బెంగాల్ ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడతామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి... తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు. రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. మరోవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

- మొదటి పేజీ తరువాయి

అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్ వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది.

ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్–కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (%×అజ×౦%)ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- మొదటి పేజీ తరువాయి

ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర %-% ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- మొదటి పేజీ తరువాయి

హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

## నిర్మల్ రూరల్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ సోదాలు..

# అడ్డంగా బుక్కైన ల్యాండ్ సర్వేయర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ రూరల్ ఎమ్మార్వో కార్యాలయంలో మంగళవారం (డిసెంబర్ 30) అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు సోదాలు నిర్వహించారు. ల్యాండ్ సర్వే కోసం సర్వేయర్లు లంచం డిమాండ్ చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక దాడులు చేశారు. లంచం తీసుకుంటున్న సర్వేయర్లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. భూమి సర్వే చేయడానికి సర్వేయర్లు రూ.15 వేల డిమాండ్ చేస్తున్నట్లు ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో లంచం ఇచ్చే సమయంలో నిఘా ఉంచి సర్వేయర్లను పట్టుకున్నారు. రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టబుడ్డారు ల్యాండ్ సర్వేయర్ బాలకృష్ణ, అతని అనుచరుడు నాగరాజ్.






పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# "సీక్రెట్ లేక్" కబ్జాలతో..!

# పార్కింగ్ దందాకు 'హైడ్రా' బ్రేక్..!

### దుర్గం చెరువులో 5 ఎకరాల్లో ఆక్రమణలు తొలగించి "ఫెన్సింగ్- హెచ్చరిక బోర్డు..




దుర్గం చెరువు విస్తీర్ణం శాటిలైట్ చిత్రాలు..

- 'పార్కింగ్'లతో అద్దెలు వసూళ్ళ దందాకు హైడ్రా ఉక్కుపాదం మోపింది..
- దుర్గం చెరువులో రూ.50 లక్షల నెలవారీ దోపిడీకి చెక్ పెట్టింది..
- ఒకప్పుడు 160.7 ఎకరాలున్న చెరువు.. 116 ఎకరాలకు కుంచించుకు పోయిన 'సీక్రెట్ లేక్'.
- ప్రజావాణి ఫిర్యాదులతో రంగంలోకి హైడ్రా..! శాటిలైట్ చిత్రాలే సాక్ష్యంగా కబ్జా గుర్తింపు..
- హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ ఐపీఎస్ ఆదేశాలతో కబ్జాలు తొలగించి ఫెన్సింగ్..
- మాధాపూర్‌లోని ఇన్ఆర్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో అక్రమంగా ఈ కబ్జా..
- దాదాపు 5 ఎకరాల భూమి ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించింది..




చెరువులో ఆక్రమణకు గురైన 5 ఎకరాలు.. రెడ్ కలర్ లైన్..




దుర్గం చెరువు ఆక్రమణలు తొలగించి హైడ్రా హెచ్చరిక బోర్డు..

గోల్కొండ రాజవంశానికి నీరు అందించిన చారిత్రక చెరువుకు, కబ్జాల దుర్గంధం ఆవహించింది.. ఐటీ కారిడార్ మధ్యలో 'సీక్రెట్ లేక్'గా పేరుగాంచిన దుర్గం చెరువు చివరికి కబ్జాల చెర నుంచి కొంచెం కొంచెంగా విముక్తి పొందుతోంది.. చుట్టూ ఎత్తైన కొండల నడుమ సహజ సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక "సీక్రెట్ లేక్" చెరువును మట్టితో పూడ్చేసి, వాహనాల పార్కింగ్‌గా మార్చి, రూ. కోట్ల దందా సాగించిన అక్రమాలకు హైడ్రా చెక్ పెట్టింది.. ప్రతినెలా రూ.50 లక్షలు అద్దె వసూళ్ళ అక్రమ వ్యాపారానికి హైడ్రా కమిషనర్ పులిస్టాప్ పెట్టారు.. ఆక్రమణలు తొలగించిన హైడ్రా, మంగళవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంపై పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 30:

-4లో



వ్యర్థాల మంటలతో అలుముకున్న పొగ..

# దుండిగల్ తండా..!

# డంపింగ్ యార్డ్‌లో మంటలు..!

### విషపూరిత రసాయన కెమికల్ వ్యర్థాల డంపింగ్‌తో తరచూ చెత్తకు మంటలు..

### డంపింగ్ యార్డులో మంగళవారం రాత్రి మంటలతో భయాందోళనలో గిరిజనులు..

- నిద్రావస్థలో అధికార యంత్రాంగం..! భయాందోళనలో తాండా వాసులు..
- కెమికల్ వ్యర్థాల మటలతో నల్లని పొగతో అలుముకున్న దుండిగల్ తండా పరిసరాలు.
- ప్లాస్టిక్, కెమికల్ వ్యర్థాల కారణంగానే మంటలు వేగంగా వ్యాపించాయని ఆరోపణ.
- మూడు నెలలుగా పిర్యాదులకు స్పందించని దుండిగల్ సర్కిల్ - పీసీబీ అధికారులు..
- చర్యలు తీసుకోకపోతే మున్సిపల్, పీసీబీ కార్యాలయాల ముందు ధర్నాకు హెచ్చరిక..

దుండిగల్ సర్కిల్ పరిధి చెత్త డంపింగ్‌లో అగ్నిప్రమాదం..




-4లో

అటు కాలుష్య నియంత్రణ మండలి..! ఇటు దుండిగల్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యానికి..! తాండా పరిసరాల వాసులు, క్యాన్సర్ కారక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.. ఇప్పటికే గడ్డ పోతారం పారిశ్రామిక వాడ, రాంకీ వేస్ట్ మేనేజ్మెంట్‌తో..! దుండిగల్ తాండా-2 వాసులు అనారోగ్యాలకు గురవుతుంటే..! దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్-59 పరిధిలోని చెత్త డంపింగ్ యార్డులో తరచూ అగ్ని ప్రమాదాలకు సంబంధిత అధికారులు చెక్ పెట్టలేక పోతున్నారు.. ఈ ప్రమాదకర కాలుష్యంపై తాండా వాసులు దర్నాలు చేసినప్పటికీ..! నిప్పుల మీద నీళ్ళు చల్లిన చందంగా అప్పుడప్పుడు తాత్కాలిక మెడికల్ క్యాంపులతో మమాః అనిపిస్తున్నారు.. ఇలాంటి ఇన్‌స్టాంట్ వైద్య శిబిరాలు కేవలం కంపెనీల ఉదారతను చాటే విధంగానే ఉంటాయి కానీ..! తాండా వాసుల అనారోగ్యాలకు పరిష్కారం కాదని గిరిజనులు ఆరోపిస్తున్నారు..లి మేడ్చల్ జిల్లా బ్యూరో/దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 30:

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ చేతులమీదుగా ప్రారంభం..
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో..
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు..




# మేడ్చల్ జిల్లా మేడిపల్లిలో..!

# మూడు కోర్టు హాలుల ప్రారంభం..!



కోర్టు హాలును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 30:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి ప్రాంతంలో ఉన్న అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మూడు కొత్త కోర్టు హాలులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ ప్రారంభించారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొని నూతన కోర్టు హాలులను ప్రారంభించారు.. ఈ సందర్భంగా న్యాయ పరిపాలనలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడంలో కీలకంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. నూతనంగా ప్రారంభించిన కోర్టు హాలులతో కేసుల విచారణ మరింత సవ్యంగా సాగేందుకు, న్యాయవాదుల సౌకర్యం మెరుగు పడేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న కేసుల భారం దృష్ట్యా ఈ కోర్టు హాలులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి తదితర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జిల్లా న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది మరో ముఖ్య ఘట్టంగా వారు పేర్కొన్నారు..






# “సీక్రెట్ లేక్” కబ్జాలతో..! పార్కింగ్ దందాకు ‘హైడ్రా’ బ్రేక్..!



కబ్జాల తొలగింపు అనంతరం, చెరువు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్..

**కొద్దికొద్దిగా మట్టిని నింపుకుంటూ ఎకరం నుంచి 5 ఎకరాల వరకూ సంబంధిత ప్రజాప్రతినిధి ఆక్రమించి. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణ అడ్డుగా మారింది.. తనదేనని చెబుతున్న ఈ భూమి ప్రతి ఏటా పెరుగుతుండడం గమనార్హం.. హెచ్ఎండిఏ మాత్రం 2014లో 160.7 ఎకరాలుగా నిర్ధారిస్తూ ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్ఆర్ఎస్సీ, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు వైశల్యాన్ని తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఈలోపు చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తోంది..**

-3 పేజి తరువాయి

ఒకప్పుడు 160.7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దుర్గం చెరువు.. ఇప్పుడు 116 ఎకరాలకు కుంచించుకు పోయింది.. మంగళవారం 5 ఎకరాల మేర కబ్జాలను తొలగించిన హైడ్రా ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డును అమర్చింది.. ఈ సీక్రెట్ లేక్ కబ్జాల పర్వాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో శాటిలైట్ చిత్రాలు బట్టబయలు చేశాయి.. ఒకప్పుడు గోల్కొండ రాజవంశానికి మంచినీరు అందించిన ఈ దర్గం చెరువు, ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేబుల్ బ్రిడ్జ నిర్మాణం పలు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టిందని చెప్పవచ్చు.. హైదరాబాద్ మహానగరానికే వన్నె తెచ్చిన ఈ చెరువు జూబ్లీహిల్స్-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య ట్రాఫిక్ తగ్గింది.. ఒకప్పుడు “సీక్రెట్ లేక్”గా ప్రసిద్ధిగాంచిన ఈ చెరువుపై కేబుల్ బ్రిడ్జ నిర్మాణం హైదరాబాద్‌కే గుర్తింపుగా మారింది..


అలాంటి దుర్గం చెరువు, “కబ్జాల దుర్గంధం” నుంచి హైడ్రా అధికారులు విముక్తి కల్పించారు.. మాధాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేరకు ఉన్న కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది. మట్టితో నింపి వాహనాల పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ. 50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు హైడ్రా చెక్ పెట్టింది. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేసింది. తర్వాత మట్టిని తొలగించేందుకు హైడ్రా చర్యలు తీసుకోనున్నట్టు హైడ్రా కమిషనర్ తెలిపారు.. దుర్గం చెరువులో బహిరంగ కబ్జాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు.. సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయి విచారణ ఆదేశించారు. ఈమేరకు పరిశీలించిన హైడ్రా అధికారులు.. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువు పూర్వపరాలను శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించి కబ్జాలను నిర్ధారించుకున్నారు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం 5 ఎకరాల ఆక్రమణలను తొలగించిన హైడ్రా కాపాడింది..

## మట్టితో నింపుతూ ఆక్రమణలు..

మాధాపూర్ ఇన్ ఆర్బిట్ మాల్ వైపు ఏకంగా 5 ఎకరాలు కబ్జాలకు గురైంది. కొండలను తవ్వుతూ భవనాలు నిర్మించిన వారికి దుర్గం చెరువు డంపింగ్ యార్డుగా మారింది.. 10 నుంచి 15 మీటర్ల మేరకు మట్టితో నింపుతూ క్రమంగా చెరువులోకి జరిగి ఏకంగా 5 ఎకరాలను కబ్జా చేశారు. అలా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమించిన స్థలం నాదంటూ ఓ ప్రజాప్రతినిధి ఇప్పుడు క్లైమ్ చేస్తున్నారు.. అంతే కాదు స్కూల్ బస్సులు, ఐటీ సంస్థలకు చెందిన వాహనాల పార్కింగ్‌తో ప్రతి నెల రూ. 50 లక్షల వరకూ అద్దెలు అనుభవిస్తున్నారు. భూమికి సంబంధించిన రికార్డులు లేకుండానే అక్కడ పార్కింగ్ దందా కొనసాగించడం గమనార్హం..

## రాజవంశీయులకు త్రాగునీరు అందించిన సీక్రెట్ లేక్..

గోల్కొండ కోటలోని రాజవంశానికి త్రాగునీరు అందించిన దుర్గం చెరువుకు ఆక్రమణల బెడద అంటుకుంది.. చుట్టూ కొండల మధ్య ఎంతో శుద్ధమైన జలాలతో దాహార్తిని తీర్చిన ఈ చెరువు కబ్జాలతో కుంచించుకు పోయింది. నగరం నడిబొడ్డున.. ఐటీ కారిడార్‌లో అందమైన సరస్సుగా అలరించిన దుర్గం చెరువు ఇప్పుడు మురుగు నీటితో దుర్గంధంగా మారింది.. ఒకప్పుడు 160.7 ఎకరాల మేరకు ఉన్న ఈ చెరువు నేడు 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహాయించి.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. 1976 నాటికే 29 ఎకరాల వరకూ కబ్జాకు గురై.. 131.66 ఎకరాలకు మిగిలిపోయింది.. 1976వ సంవత్సరం నుంచి 1995 వరకూ భద్రంగానే ఉన్నప్పటికీ.. 1995 నుంచి 2000 సంవత్సరం వరకూ మరో 10 ఎకరాలు కబ్జాకు గురై.. 121 ఎకరాలకు కుంచించుకుపోయింది. 2000 నుంచి నేటికి మరో 5 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా ఎప్పుడు ఏ సంవత్సరంలో కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ఆర్ఎస్సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కట్టినట్లు సాక్షాత్కరిస్తున్నాయి..



వ్యర్థాల మంటలతో అలుముకున్న పొగ..

# దుండిగల్ తండా..!

# డంపింగ్ యార్డ్‌లో మంటలు..!

## చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి..

శుద్ధికర్మాగారానికి తరలించాల్సిన కెమికల్ రసాయన వ్యార్థాలను, చెత్త డంపింగ్‌లో అక్రమంగా పారబోయడమే కాకుండా, సంబంధిత కెమికల్ వ్యర్థాల ఆనవాళ్ళు కనిపించకుండా చేసే ప్రక్రియలో భాగంగా, అగ్నికి ఆహూతి చేస్తూ, స్థానిక తాండా వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.. ఇలాంటి అగ్నిప్రమాదాలు మొదటిసారి కాదని. డంపింగ్ యార్డ్‌లో తరచూ ఇలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..




గతంలో 2024 మార్చి 12న “పెన్ పవర్” దినపత్రికలో వార్తా కథనం..

## విషపూరిత రసాయన కెమికల్ వ్యర్థాల డంపింగ్‌తో తరచూ చెత్తకు మంటలు..

## డంపింగ్ యార్డులో మంగళవారం రాత్రి మంటలతో భయాందోళనలో గిరిజనులు..

- నిద్రావస్థలో అధికార యంత్రాంగం..! భయాందోళనలో తాండా వాసులు..
- కెమికల్ వ్యర్థాల మటలతో నల్లని పొగతో అలుముకున్న దుండిగల్ తండా పరిసరాలు.
- ప్లాస్టిక్, కెమికల్ వ్యర్థాల కారణంగానే మంటలు వేగంగా వ్యాపించాయని ఆరోపణ.
- మూడు నెలలుగా పిర్యాదులకు స్పందించని దుండిగల్ సర్కిల్ - పీసీబీ అధికారులు..
- చర్యలు తీసుకోకపోతే మున్సిపల్, పీసీబీ కార్యాలయాల ముందు ధర్నాకు హెచ్చరిక..

## మూడు నెలలుగా ఫిర్యాదులు..! పట్టించుకోని యంత్రాంగం..

గత మూడు నెలలుగా, కెమికల్ వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న కంపెనీల పేర్లతో సహా పీసీబీ అధికారులకు పిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.. డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న కంపెనీ వ్యర్థాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, శాశ్వత పరిష్కారం చూపాలని తండా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..బుధవారం (నేడు) చర్యలు తీసుకోకపోతే, దుండిగల్ తండా ప్రజలంతా రోడ్డుపైకి వచ్చి మున్సిపల్ కార్యాలయం, పీసీబీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని ముక్తకంఠంతో హెచ్చరించారు..అధికారుల నిర్లక్ష్యంతో ఏమేరకు ప్రజల ప్రాణాల్ని బలితీసుకుంటుందోనన్న ప్రశ్నలు ఇప్పుడు దుండిగల్ తండాలో ఉత్కంఠగా మారాయి.




దుండిగల్ సర్కిల్ పరిధి చెత్త డంపింగ్‌లో అగ్నిప్రమాదం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో/దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 30:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా డంపింగ్ యార్డ్‌లో ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చెత్తలో చెలరేగిన మంటల కారణంగా పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన నల్లని పొగతో కమ్ముకుపోయాయి.. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న విషపూరిత పొగతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు.. రాత్రి సమయంలో పొగ కారణంగా రహదారిపై వాహనదారులకు దారి కనిపించక ప్రమాదకర పరిస్థితులు తలెత్తాయని ఆరోపిస్తున్నారు.. ఓవైపు కాలుష్యం, మరోవైపు వాహనాల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..స్థానికుల సమాచారం ప్రకారం, కాజిపల్లి పరిసర ప్రాంతాల్లోని పలు కంపెనీల నుంచి చెత్తను సేకరించి ఈ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు.. ఆ చెత్తలో ప్లాస్టిక్, కెమికల్ రసాయన వ్యర్థాలు అధికంగా ఉండటంతోనే ఈ మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు తండా ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.. ఇది కేవలం ప్రమాదం కాదని, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఈ ప్రమాదం మానవసృష్టి విపత్తుగా వారు ఆరోపిస్తున్నారు..

**అటు కాలుష్య నియంత్రణ మండలి..! ఇటు దుండిగల్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యానికి..! తాండా పరిసరాల వాసులు, క్యాన్సర్ కారక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.. ఇప్పటికే గడ్డ పోతారం పారిశ్రామిక వాడ, రాంకీ వేస్ట్ మేనేజ్మెంట్‌తో..! దుండిగల్ తాండా-2 వాసులు అనారోగ్యాలకు గురవుతుంటే..! దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్-59 పరిధిలోని చెత్త డంపింగ్ యార్డులో తరచూ అగ్ని ప్రమాదాలకు సంబంధిత అధికారులు చెక్ పెట్టలేక పోతున్నారు.. ఈ ప్రమాదకర కాలుష్యంపై తాండా వాసులు దర్నాలు చేసినప్పటికీ..! నిప్పుల మీద నీళ్ళు చల్లిన చందంగా అప్పుడప్పుడు తాత్కాలిక మెడికల్ క్యాంపులతో మమః అనిపిస్తున్నారు.. ఇలాంటి ఇన్‌స్టాంట్ వైద్య శిబిరాలు కేవలం కంపెనీల ఉదారతను చాటే విధంగానే ఉంటాయి కానీ..! తాండా వాసుల అనారోగ్యాలకు పరిష్కారం కాదని గిరిజనులు ఆరోపిస్తున్నారు..లి**



దుండిగల్ తండా పక్కనే పారిశ్రామిక వాడ..

## పులి సంచారం.. పల్లెల్లో అలజడి!

**భూపాలపల్లి, డిసెంబర్ 30 పెన్ పవర్:** పెద్దపులి సంచారంతో అటవీ సమీప పల్లెల్లో అలజడి నెలకొంది. దట్టమైన అడవులు లేకున్నా.. పంటపొలాల్లో పులి కనిపించడంతో.. రైతులు, స్థానికులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మూడు రోజుల క్రితం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జడల్‌పేట్ శివారు గాంధీనగర్‌లోని బొట్ల రాజపోచయ్య రైతుకు చెందిన ఎద్దును తన పొలం వద్ద పులి చంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సూచిస్తోంది.

## వాటర్ షెడ్ పథకం కింద వ్యవసాయ పరికరాల పంపిణీ

**ఆందోల్, డిసెంబర్ 30 పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం వాటర్ షెడ్ పథకం ద్వారా మంజూరు అయిన వ్యవసాయ పరికరాలను ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం బొద్మాట్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పు శంకరప్ప, ఉపాధ్యక్షుడు బాలయ్య, వాటర్ షెడ్ అధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బీరప్ప, కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పు శంకరప్ప సూచించారు.

## పొలం పనుల్లో కుప్పకూలి వ్యక్తి మృతి

**సంగారెడ్డి, డిసెంబర్ 30 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన జోగు (గుండెల) ప్రభాకర్ అనే రైతు పొలం పనులు చేస్తుండగా అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కుప్పకూలిపోయాడు. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఏటీఎం చోరీ యత్నం విఫలం, దుండగులు పరార్

**పటాన్‌చెరు, డిసెంబర్ 30 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు శ్రీరామ్ నగర్ కాలనీ సమీపంలోని ఎస్బీఐ ఏటీఎంలో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం యంత్రం కింది భాగంలో తలుపు తీసి కేబుల్స్ తగలబెట్టి నగదు దోచుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పటాన్ చెరు పోలీస్ బ్లూ కోట్ సిబ్బంది రావడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓడిన సర్పంచ్ అభ్యర్థి చేతుల మీదుగా గెలిచిన వారికి సన్మానం

**నారాయణఖేడ్, డిసెంబర్ 30 పెన్ పవర్:** దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి కొక్కడగల్ల రాజేశ్వరి స్వామి, గెలిచిన సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్ర రెడ్డి, ఉపసర్పంచ్ బోల్గం ప్రవీణ్ గౌడ్, మరియు వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యమని స్వామి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సర్పంచ్ గా ఓడినా, గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జోగు అనిల్, మీరుదొడ్డి స్వామి, కొక్కడగల్ల రాజు, కొక్కకడగల్ల గణేష్, నర్సగల్ల సతీష్ పాల్గొన్నారు.

## పాఠశాల పనులు పూర్తి చేయాలి:

**గద్వాల, డిసెంబర్ 30 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం అల్లంపూర్ నియోజకవర్గం బింగి దొడ్డి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి ఉంది. విద్యార్థులకు అవసరమైన వాటర్ ట్యాంక్, వంటగదులు, టాయిలెట్స్, బాత్రూమ్స్, అటెండర్, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కేటాయింపు వంటి వసతులు కల్పించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల నాణ్యత లేక వర్షాకాలంలో ఇబ్బందులు కలుగుతున్నాయని, ఉన్నత అధికారులు, నాయకులు స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మానస టీవీ రిపోర్టర్ గోపాల్ ఈ వార్తను సేకరించారు.

## పాఠశాల పనులు పూర్తి చేయాలి:

**ఆలంపూర్, డిసెంబర్ 30 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం అల్లంపూర్ నియోజకవర్గం బింగి దొడ్డి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి ఉంది. విద్యార్థులకు అవసరమైన వాటర్ ట్యాంక్, వంటగదులు, టాయిలెట్స్, బాత్రూమ్స్, అటెండర్, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కేటాయింపు వంటి వసతులు కల్పించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల నాణ్యత లేక వర్షాకాలంలో ఇబ్బందులు కలుగుతున్నాయని, ఉన్నత అధికారులు, నాయకులు స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మానస టీవీ రిపోర్టర్ గోపాల్ ఈ వార్తను సేకరించారు.

## అడ్డగోలుగా తవ్వకాలు

**కొల్లాపూర్, డిసెంబర్ 30 పెన్ పవర్:** నల్లమలలో గుప్తనిధులకోసం తవ్వకాలు ఆగడంలేదు. పురాతన క్షేత్రాలు, కట్టడాలే లక్ష్యంగా చేసుకొని ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. కొల్లాపూర్‌అటవీశాఖ పరిధిలోని అంకిల్‌పెంట సెక్షన్ ప్రాంతంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాల మధ్యలో దేవునిబొక్క గుడిలో తవ్వేశారు. అటవీఅధికారులు పలువుర్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ గుడిలోని గుహలో జనరేటర్ ఏర్పాటు చేసి అత్యాధునిక సామగ్రితో విగ్రహాలను తొలగించి తవ్వేయడం గమనార్హం. జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చేయాలని ఏర్పాట్లు చేశారని అటవీ అధికారవర్గాలు చెబుతున్న నేపథ్యంలో అందరిలో ఆందోళన ఎక్కువవుతోంది.

## ప్రియురాలు చనిపోయిందని ప్రియుడి ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 30 పెన్ పవర్:** కొల్లాపూర్, రెండేళ్లుగా ప్రేమించిన ప్రియురాలు మృతి చెందిందని తెలుసుకున్న ఆ అబ్బాయి ఈ లోకంలో ఉండలేనని తనువు చాలించాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని ఓ గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. ఇంటి పరువు పోతుందని ఇరుకుటుంబాల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదులు చేయకపోవడం గమనార్హం.

## మంటల్లో కాలిపోతున్న ఆదాయం

**జడ్చర్ల, డిసెంబర్ 30 పెన్ పవర్:** అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల చెత్తతో సమకూరాల్సిన రూ.లక్షల ఆదాయం రాకుండా పోతోంది. జడ్చర్ల పురపాలికలో నేటికీ డంపింగ్‌యార్డు లేకపోవడమే దీనికి కారణం. దీంతో ఆదాయం తెచ్చిపెట్టాల్సిన ప్లాస్టిక్ వ్యర్థాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

## జిల్లా కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం

**మునుగోడు, డిసెంబర్ 30 పెన్ పవర్:** నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పల్సర్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి ఢీకొన్న టిప్పర్ లోడ్ ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ వెనుక టైర్ల కిందపడి తల భాగం నుజ్జునుజ్జు అయింది. టిప్పర్ వాహనం కంకర పౌడర్ లోడుతో వెళ్తోంది. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# బార్ కౌన్సిల్ చైర్మన్గా రాపోలు భాస్కర్కు మద్దతు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు %–% 2026 నేపథ్యంలో, మహిళా కోటాలో బార్ కౌన్సిల్ మెంబర్గా కృష్ణమోని స్వాతి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ తనను బార్ కౌన్సిల్ మెంబర్గా అఖండ మెజారిటీతో గెలిపిస్తే, ప్రస్తుత చైర్మన్ రేస్లో ఉన్న రాపోలు భాస్కర్ కి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 36,000 మంది న్యాయవాదులకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవిగా నిలుస్తున్నాయని తెలిపారు. మొత్తం 25 మంది సభ్యులతో కూడిన బార్ కౌన్సిల్ వ్యవస్థ ఫిబ్రవరి 2026లో రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించిన సుప్రీం ధర్మాసనంకు మరియు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ నిర్ణయం మహిళా న్యాయవాదుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 88 బార్ అసోసియేషన్లలో మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి బార్ అసోసియేషన్కు 2 బెంచీలు, 1 ఏసీ, 20 కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలను బార్ కౌన్సిల్ ఫండ్ నుంచి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల ప్లీడర్గా పేరుగాంచిన రాపోలు భాస్కర్ ని చైర్మన్గా ఎన్నుకోవడం ద్వారా న్యాయవాదులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా,



బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్న న్యాయవాదుల కోసం మిల్లెట్లతో కూడిన భోజనం అందించేలా బార్ కౌన్సిల్లో ఒక తీర్మానం (రిజల్యూషన్) ఆమోదింపజేస్తామని కృష్ణమోని స్వాతి వెల్లడించారు. గత ఆరు సంవత్సరాల బార్ కౌన్సిల్ పాలనలో నష్టపోయిన అభ్యర్థులందరికీ న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని సుమారు 35,000 మంది న్యాయవాదులు తనను మహిళా బార్ కౌన్సిల్ అభ్యర్థిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# అవినీతిలో కూరుకుపోయిన ఎమ్మెల్యే రాజా సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** సమాజంలో ప్రశ్నించే గొంతు తయారైనప్పుడు బలమైన సమాజం నిర్మితమవుతుందని, ఆ దిశగానే గోషామహల్ నియోజకవర్గంలోనీ, సమస్యల పరిష్కారానికి, బస్తీ నిద్ర, చక్కటి వేదికగా నిలుస్తుందని, గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు, ఉస్మాన్ షాహి లోని, శ్రీ జంగల్ విఠోబా దేవాలయంలో, విఠలేశ్వర రుక్మాబాయిలకు, ప్రత్యేక పూజలు నిర్వహించి, గోషామాల్ లో బస్తీ, నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు,, , అక్కడే ఏర్పాటుచేసిన బస్తీ నిద్ర కుటిర కేంద్రాన్ని, గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ,,, ఈ బస్తీ, నిద్ర కార్యక్రమం ద్వారా, బస్తీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన మౌలిక వసతులు, నిరుపేద విద్యార్థులకు అందించాల్సిన క్రియేటివ్ ఎడ్యుకేషన్, ప్రజా ఆరోగ్యం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగం భద్రతగా, రాజకీయ నవీకరణ, తదితర అంశాల పైన, వివరాలను అడిగి తెలుసుకుని, పరిష్కారం కోసం, , తమ వాలంటరీలను ఆయా బస్తీలోకివెళ్లి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కారం కోసం, అక్కడే ఏర్పాటు చేసిన కుటీర కేంద్రంలో, వివరాలు సేకరించి, పరిష్కారానికి, కృషి చేస్తామని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమం ఏడాది పడిన కొనసాగుతుందని,,, త్వరలో గడ్డం పొలిటికల్ అకాడమీ ని ఏర్పాటు చేయనున్నామని, ఈ అకాడమీ ద్వారా, యువతకు విలువలు, సిద్ధాంతాలు, నీతివంతమైన రాజకీయం, తదితర అంశాల పైన వారిని, తీర్చిదిద్దామన్నారు, ముఖ్యంగా, గోషామాయిల్ నియోజవర్గం ఎమ్మెల్యే, రాజాసింగ్, బేగంబజార్ కార్పొరేటర్, జి శంకర్ యాదవ్, అవినీతిలో కూరుకుపోయారని, వేల కోట్లలో ఆస్తులు సంపాదించారని, త్వరలో వీరి భరతం పట్టేందుకు తాము క్యారాచరణ రూపొందిస్తున్నామన్నారు, ఇలాంటి రాజకీయ నాయకులను , గద్ద దింపడమే, తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు, గో షా మహల్ నియోజకవర్గ ప్రజలు, తమ సమస్యలను, ఈ బస్తీ నిద్ర కార్యక్రమం దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు,,

# అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు.

# ఆందోళన వద్దు, మీతో నేనున్నా

### డెస్క్ జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి హామీ

**హైదరాబాద్ పెన్ పవర్:** అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు.

మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీడబ్ల్యు జేఎఫ్, డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులతో మంత్రి వివిధ అంశాలపై చర్చించి వారి సందేహాలను తీర్చారు. కొంతమంది అపోహలకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. మీరు వాటిని నమ్మకండి. ఎలాంటి పక్షపాతం లేదు. మీరెవరూ ఆందోళన చెందొద్దు. మీతో నేనున్నాను. రెండు విభాగాలుగా చూడాలన్న ఆలోచన కాదు. ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ పథకాలను వర్తింపచేస్తాం. అర్హులైన, నిజమైన జర్నలిస్ట్‌లకు మేలు చేయాలన్న సంకల్పం, సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయం. తెలంగాణ రాష్ట్రంలో మినహా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే రాష్ట్రంలోని అన్ని జర్నలిస్ట్ సంఘాలతో



సమావేశం నిర్వహిస్తామని ఆ సమావేశానికి డెస్క్ జర్నలిస్ట్‌లను కూడా ఆహ్వానిస్తామని అందరి అభిప్రాయాలను, సలహాలను సూచనలను తీసుకొని జర్నలిస్ట్‌లకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు.

టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు బి. రాజశేఖర్, గంద్ర నవీన్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, మస్తాన్, నాయకులు నిస్సార్, విజయ, రాజారాం, స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# వైభవానికి 'గ్రహణం'.. పాలకుల 'నిర్లక్ష్యం'

## అలంపూర్ క్షేత్రంలో వెలవెలబోయిన వైకుంఠ ఏకాదశి

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచి, అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన "అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి" ఆలయం వైకుంఠ ఏకాదశి పర్వదినాన కళ తప్పింది. ఏటా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న ఈ పుణ్యక్షేత్రంపై దేవస్థాన అధికారుల నిర్లక్ష్యం భక్తులను తీవ్ర విస్మయానికి గురిచేసింది. ముక్కోటి ఏకాదశి అంటే భక్తులతో కిటకిటలాడి, విద్యుత్ దీపాలతో వెలిగిపోవాల్సిన క్షేత్రం.. నేడు కనీస అలంకరణకు కూడా నోచుకోకపోవడం పాలకుల అసమర్థతకు అద్దం పడుతోంది.

**శివకేశవుల సంగమం.. కానీ అలంకరణ శూన్యం!**

బాలబ్రహ్మేశ్వర ఆలయం అంటే కేవలం శివాలయం మాత్రమే కాదు. ఇక్కడ మహావిష్ణువు ప్రతిరూపమైన "విష్ణు సాలగ్రామం" కొలువై ఉండటం ఈ క్షేత్రం యొక్క విశిష్టత. వైకుంఠ ఏకాదశి నాడు శివకేశవుల ఆశీస్సుల కోసం భారీగా తరలివచ్చిన భక్తులకు నిరాశే ఎదురైంది.

నామమాత్రపు అలంకరణ: ఆలయ ప్రాంగణంలోని రెండు మామిడి ఆకులు, కొబ్బరి మట్టలు, అరకొర బంతి పూల దండలతో మమ అనిపించి అధికారులు చేతులు దులుపుకున్నారు.

**గత వైభవానికి భిన్నంగా..**

గతంలో పనిచేసిన అధికారులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, అద్భుతమైన పుష్పాలంకరణతో ముస్తాబు చేసేవారని, నేడు ఆ వైభవం మృగ్యమైందని స్థానికులు మండిపడుతున్నారు

**రూ.10కోట్ల ఆదాయం ఉన్నా.. అశ్రద్ధేనా?**

ఏటా సుమారు పది కోట్ల రూపాయల ఆదాయం గల ఈ ఆలయానికి పూల అలంకరణ చేయడానికి నిధుల కొరత ఉందా? లేక అధికారుల చిత్తశుద్ధి లోపమా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎంతో ఆశతో వచ్చిన భక్తులు, ఆలయం వెలవెలబోతుండటం చూసి అధికారుల తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు.

"తెలంగాణలోనే అతిపెద్ద క్షేత్రంగా విరాజిల్లుతున్న అలంపూర్‌లో ఇలాంటి పరిస్థితి రావడం చాలా బాధాకరం. పండుగ పూట భక్తి భావం ఉట్టిపడాల్సిన ఆలయం, అధికారుల నిర్లక్ష్యం వల్ల కళావిహీనంగా మారింది.

**"చుట్టపు చూపుగా వచ్చిపోయే ఈవో తోచుట్టూరా సమస్యలు**

ఇంత పెద్ద ఆలయానికి స్థానికంగా ఉండే ఈవో లేకపోవడంతో ఇంచార్జివో వారానికి నాలుగు గంటలు చుట్టూ చుట్టూగా వచ్చి వెళ్ళిపోతుంది. దీంతో ఆలోచిస్తూ ప్రతినిత్యం సమస్యలు తాండవిస్తున్నాయి. రికార్డులలో లెక్కలు మాత్రం ఆకాశానంటే విధంగా చూపిస్తారు వాస్తవిక పరిస్థితుల్లో ఆలయం నిర్లక్ష్యానికి గురవుతుంది.

– ఆవేదనలో భక్తులు

అధికారులు ఇప్పటికైనా స్పందించి, ఇలాంటి పర్వదినాల్లో క్షేత్రం యొక్క ప్రాశస్త్యాన్ని కాపాడేలా, భక్తుల మనోభావాలను గౌరవించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా, క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంలోనూ, పండుగలను వైభవంగా నిర్వహించడంలోనూ విఫలమవుతున్న అధికారులపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గులాబీకి కలిసి రాని కాలం




**హైదరాబాద్, డిసెంబర్ 30, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్, బీఆర్ఎస్ పేర్లు చెబితే పార్టీ క్యాడర్‌లో ఒక జోష్, ఉత్సాహం కనిపిస్తుంది. తెలంగాణ అభిమానుల్లో ఒక ఆవేశం తొణికిసలాడుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్.. తిరుగులేని నాయకుడిగా గురి?ంపు తెచ్చుకున్నారు. అయితే 2023 ఎన్నికలనాటికి కేసీఆర్, అతని కుటుంబం అనుసరించిన విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీంతో మూడోసారి గెలవాలన్న కేసీఆర్ ఆకాంక్ష నెలరవేరలేదు. దశాబ్దకాలం తిరుగులేని నేతగా ఉన్న కేసీఆర్ గ్రాఫ్ 2023 డిసెంబర్ తర్వాత నుంచి పడిపోతూ వస్తోంది. 2025లో అయితే ఇటు పార్టీ, అటు కుటుంబం, మరోవైపు అనారోగ్య సమస్యలు కేసీఆర్‌ను చుట్టుముట్టాయి. దీంతో దాదాపు ఏడాదికాలం ఆయన ప్రజలో?్లకి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఆశించిన ప్రభావం చూపలేదు. పార్టీలో కలహాలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, సొంత పార్టీపైనే కూతురు ఆరోపణలు.. ?కేసీఆర్‌పై మరింత ఒత్తిడి పెంచాయి2025 కేసీఆర్‌కు పరీక్షల సంవత్సరంగా మారింది. పార్టీ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలని కేసీఆర్ పట్టుదలగా పోరాడుతున్నారు. సుప్రీం కోర్టు వరకు కూడా వెళ్లారు. అయితే కేసుల్లో వేగం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ. ఇక కేసీఆర్ కూతురు, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేశారు. సొంత నేతలపైనే ఆరోపణలు చేశారు. దీంతో చివరకు కూతురును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి కేసీఆర్‌కు వచ్చింది. అయితే కవిత పార్టీని వదిలి, తండ్రి పాలనపై దర్యాప్తు చేస్తానని షాక్ ఇచ్చారు. ఆమె లక్ష్యం వేరైనా, దెబ్బ తగిలేది కేసీఆర్‌కేబీఆర్ఎస్ కార్యకర్తల్లో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆందోళనా గుసగుసలు ఎక్కువ. ఏడాదంతా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే పరిమితం కావడం అనుమానాలకు తావిచ్చింది. అవసర సమయంలో వైద్య పరీక్షలకు వస్తున్నారు. అక్కడి నుంచే పార్టీ ఆదేశాలు జారుతున్నాయి. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించినా, మేడిగడ్డ బ్యారేజ్, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో విచారణలు, ఫార్ములా-ఈ రేస్ ఆరోపణలు కుటుంబాన్ని చుట్టుముట్టాయి. ఈ ఒత్తిడులు ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని పార్టీలో అభిప్రాయం. 2025-26 బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ తొలిరోజు మాత్రమే కనిపించారు. కొద్ది నిమిషాల పాటే. తర్వాత అసెంబ్లీలో ముఖం చూపలేదు. తాజాగా శీతాకాల సమావేశాల తొలిరోజు మళ్లీ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి నమస్కారం చేసిన ఆ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేవలం ఐదు నిమిషాలే అసెంబ్లీ హాల్‌లో ఉండి వెళ్లిపోయారు. హాజరు పడేందుకే కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్ పార్టీకే కాదు ప్రజలకూ దూరంగా ఉంటున్నారు. జల వివాదాల మధ్య నల్లగొండలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ భారీ పబ్లిక్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ప్రజల ముందు కనిపించలేదు. రెండేళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తన స్టైల్‌లో విమర్శలు గుప్పించారు. కానీ తర్వాత మళ్లీ సైలెంట్ అయ్యారు. దీంతో ప్రజల్లోనూ, పార్టీలోనూ కేసీఆర్ గ్రాఫ్ పడిపోతోంది.

2025 సంవత్సరం బీఆర్ఎస్ రెండు కీలక ఎన్నికలు ఎదుర్కొంది. జూబ్లీహిల్స్ బై-పోల్‌లో మాగుంట గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో మాత్రం మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మొత్తంగా 2025 కేసీఆర్‌కు పరాజయాలే ఎక్కువగా ఎదురయ్యాయి.

# నిమ్స్ ఉద్యోగుల నిరీక్షణకు తెర

**హైదరాబాద్, డిసెంబర్ 30, పెన్ పవర్:** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. వీరు కోరుతున్న విధంగా ఆర్జిత సెలవుల నగదు మార్పిడి సౌకర్యాన్ని కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నం. 230 జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న రెగ్యులర్ సిబ్బందికి ఇకపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ సెలవులను సరెండర్ చేసి నగదు పొందే వీలుంటుంది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి' సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో.. ప్రభుత్వం దీనికి సంబంధించి కీలకమైన ఉత్తర్వులను (జీవో నంబర్ 230) విడుదల చేసింది. నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎయిమ్స్ తరహాలో శాలరీలు అమలులో ఉన్నాయి. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే 'సెలవుల నగదు మార్పిడి' సదుపాయం వీరికి గతంలో వర్తించేది కాదు. దీనివల్ల ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా వాడుకోకుండా మిగిలిపోయిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యను పరిష్కరించాలని నిమ్స్ ఉద్యోగ సంఘాలు.. ముఖ్యంగా నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఇటీవల వారు మంత్రిని కలిసి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను సమన్వయం చేశారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. తెలంగాణ సెలవు నిబంధనలు-1933 ఇకపై నిమ్స్ ఉద్యోగులకు కూడా వర్తిస్తాయి. దీనివల్ల.. ఉద్యోగులు తమ ఖాతాలో ఉన్న ఆర్జిత సెలవులను ప్రభుత్వానికి అప్పగించి (సరెండర్ చేసి), దానికి సమానమైన నగదును పొందే వీలుంటుంది. ఇది అత్యవసర సమయాల్లో లేదా పదవీ విరమణ సమయంలో వారికి పెద్ద ఆర్థిక ఆసరాగా మారుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నిమ్స్ సిబ్బందికి కూడా ఈ హక్కు లభించడం వల్ల వారిలో వివక్ష తొలగిపోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలు అందించే నర్సులు.. పారామెడికల్, ఇతర సాంకేతిక సిబ్బందిలో ఈ నిర్ణయం నూతనోత్సాహాన్ని నింపుతుంది. ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల ఆసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేసే వారికి ఇలాంటి రాయితీలు ఇవ్వడం వల్ల వారు మరింత నిబద్ధతతో పనిచేస్తారని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఈ జీవోను జారీ చేస్తూ.. నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలని సూచించారు. ఈ నిర్ణయం పట్ల నిమ్స్ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ దీర్ఘకాలిక సమస్యను అర్థం చేసుకుని.. తక్షణమే జీవో వచ్చేలా కృషి చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. వేలాది మంది కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా మేలు జరగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల అడుగు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా దారి చూపుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# ఇక టోల్ ఫ్రీ ప్రయాణం

**నల్గొండ, డిసెంబర్ 30, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి ప్రయాణాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతోంది. పండుగ రోజుల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోకుండా ఉండేందుకు.. ఆ మూడు నాలుగు రోజుల పాటు టోల్ వసూళ్లను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం నుండి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్రయాణికులకు టోల్ కష్టాలు తప్పవు. ముఖ్యంగా పంతంగి, కొర్లపహాడ్ చిల్లకల్లు వంటి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతుంటాయి. ఫాస్టాగ్ సౌకర్యం ఉన్నప్పటికీ.. వాహనాల సంఖ్య లక్షల్లో ఉండటంతో ఒక్కో టోల్ ప్లాజా దాటడానికి గంటల సమయం పడుతోంది. పండుగకు వెళ్లే ఉత్సాహంలో ఉన్న సామాన్యులకు ఈ ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని చూపిస్తున్నాయి. చంటిపిల్లలు, వృద్ధులతో ప్రయాణించే వారు ఈ రద్దీలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏటా కనిపిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ జాతీయ రహదారిపై పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వివిధ చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసు రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల కారణంగా రహదారిపై ఇప్పటికే అనేక చోట్ల మళ్లింపులు ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా.. ఇక పండుగ రద్దీ తోడైతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను ఆపితే.. ఆ రద్దీ వెనక్కి కిలోమీటర్ల మేర విస్తరించి హైవే అంతా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. క్లిష్ట పరిస్థితిని గమనించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ప్రజలకు ఊరటనిచ్చేలా టోల్ మినహాయింపు అంశాన్ని తెరపైకి తెచ్చారు. టోల్ గేట్ల

నిర్వహణను తాత్కాలికంగా నిలిపివేస్తే వాహనాలు ఆగకుండా సాఫీగా సాగిపోతాయని తద్వారా ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించే సమావేశంలో ఈ ప్రతిపాదనపై స్పష్టత రానుంది. కేంద్ర ప్రభుత్వం గనుక దీనికి సానుకూలంగా స్పందిస్తే.. ఈ ఏడాది సంక్రాంతి ప్రయాణం సామాన్యులకు ఎంతో హాయిగా మారనుంది

## గోవింద నామస్మరణతో మారుమోగిన శేరిలింగంపల్లి లోని ఆలయాలు..

**రంగారెడ్డి పెన్ పవర్:** వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు..ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించే అత్యంత పవిత్రమైన 'ఉత్తర ద్వార దర్శనం' కోసం భక్తులు వేకువజామున 4 గంటల నుంచే క్యూ లైన్లలో నిలబడ్డారు..చందానగర్, మియాపూర్,కొండాపూర్, గచ్చిబౌలి మరియు శేరిలింగంపల్లి పరిధిలోని ప్రధాన ఆలయాలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఆలయ ప్రాంగణాలన్నీ "గోవిందా.. గోవిందా.." అనే నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు,మంచినీరు మరియు ప్రసాద వితరణ కోసం ఆలయ కమిటీలు పటిష్టమైన ఏర్పాట్లు చేశాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు గట్టి భద్రతను పర్యవేక్షించారు.

# నాచారం లో దారుణం

**నగల కోసం వృద్ధురాలి గొంతు నులిమి హత్య**

**మృతదేహాన్ని ఆంధ్ర గోదావరి నదిలో పడేసిన దుండగులు**

**ఈ నెల 18న నాచారం పోలీసు స్టేషన్ లో సూరెడ్డి సుజాత మిస్సింగ్ కేసు నమోదు**

**కేసును చేధించిన పోలీసులు.. ముగ్గరి అరెస్ట్**

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారు నగల కోసం వృద్ధురాలిని హత్య చేసిన కేసును నాచారం పోలీసులు ఛేదించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. నాచారం పోలీస్ స్టేషన్ లో సీఐ ధనుంజయ కేసు వివరాలు వెల్లడిం చారు. ఈ నెల 18న మల్లాపూర్ లోని బాబానగర్ కు చెందిన సూరెడ్డి సుజాత(65) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నాచారం పీఎస్లోలో ఫిర్యాదు చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మడ్డు అంజిబాబు(31) రెండు నెలల క్రితం సూరెడ్డి సుజాత ఇంట్లో అద్దెకు ఉంటూ ప్రైవేటుగా డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఇంట్లో ఉంటున్న సుజాతను హత్యచేసి బంగారు నగలు చోరీ చేయాలని పథకం వేశాడు. ఈ నెల 18న వృద్ధురాలు సుజాత గొంతు నులిమి చంపాడు. అనంతరం తన బావమర్ది నక్కంటి యువరాజు(18), స్నేహితుడు నూకల దుర్గారావు(35) సాయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ఆంధ్రప్రదేశ్ లోని కోనసీమ జిల్లాకు చేరుకుని కృష్ణ లంకలోని గోదావరి నదిలో పడేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కోనసీమ జిల్లా, రాజోల్ మండలం, పొదులాడ జంక్షన్ వద్ద నిందితులను అరెస్టు చేసి, 4 బంగారు గాజులు, 1 గొలుసు, 2 చెవి దిద్దులను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలు చట్టబద్ధంగానే జరుపుకోవాలి: సీపీ

**రామగుండం, డిసెంబర్ 30 పెన్ పవర్:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కీలక సూచనలు చేశారు. డిసెంబర్ 31 రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, డీజేలు, బాణాసంచా నిషేధమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుతంగా, కుటుంబ సమేతంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు.

## మంథనిలో ముక్కోటి ఏకాదశి: వైకుంఠ ద్వార దర్శనానికి భక్తజన సందోహం

**మంథని, డిసెంబర్ 30 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా మంథనిలోని శ్రీ లక్ష్మీ నారాయణ దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మూల సరోజన, మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మి, గురు స్వామి మల్కారామారావుతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రావికంటి మనోహర్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఓడ్నాల ప్రవళిక, స్థానిక మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం:




**భద్రాచలం, డిసెంబర్ 30 పెన్ పవర్:** భద్రాచలం రామయ్య సన్నిధిలో జరిగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేశామని, సహకరించిన జిల్లా యంత్రాంగానికి, భక్తులకు, పాత్రికేయులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ సర్పంచ్ బహిష్కరణ

**పినపాక, డిసెంబర్ 30 పెన్ పవర్:** పంచాయితీ ఎన్నికల్లో పార్టీ నిబంధనలను ఉల్లంఘించి, బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలిపినట్లు నిర్ధారణ కావడంతో పినపాక మాజీ సర్పంచ్ గొగ్గల నాగేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మండల అధ్యక్షుడు రామనాథం ప్రకటించారు. బయ్యారం క్రాస్ రోడ్ వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకే ఈ చర్య తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘటన పార్టీలో క్రమశిక్షణ చర్యలకు ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

## కేఎంసీ కమిషనర్ కు బీఆర్ఎస్ కార్పొరేటర్ల వినతి

**కొత్తగూడెం, డిసెంబర్ 30 పెన్ పవర్:** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, యూఏసీ, సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్ పేరుతో ప్రజలపై అక్రమంగా పన్నులు విధిస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి వినతిపత్రం అందజేసిన వారు, కేవలం పార్కింగ్ కోసం ఉపయోగించే సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్లపై ఆస్తి పన్ను విధించడం అన్యాయమని పేర్కొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు

**అశ్వారావుపేట, డిసెంబర్ 30 పెన్ పవర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఖండించారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో జరిగిన సీపీఎం పాలేరు డివిజన్ వర్క్ షాప్ లో ఆయన మాట్లాడుతూ, రాబోవు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

## ఈ స్ఫూర్తిని కొనసాగిద్దాం..

**ఇల్లందు, డిసెంబర్ 30 పెన్ పవర్:** చాలా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే సామాన్యులు భయపడే పరిస్థితి. దస్త్రం కదలాలన్నా.. పట్టా దక్కాలన్నా.. సంక్షేమ పథకం అందాలన్నా.. 'చేయి తడపాల్సిందే'. ఈ అవినీతిని ధైర్యంగా ప్రతిఘటించాలనే మార్పు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది వ్యవధిలో బాధితులు ఏకంగా 44మంది లంచగొండి ఉద్యోగులను అవినీతి నిరోధక శాఖకు పట్టించడం గమనార్హం. ఉభయ జిల్లాల నుంచి మునుపెన్నడూ ఇంత పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందలేదని సాక్షాత్తూ అనిశా అధికారులే పేర్కొనడం విశేషం.

## జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలకు నిహాన పటేల్ ఎంపిక



**జనగామ, డిసెంబర్ 30 పెన్ పవర్:** ఇనుగుర్తి మండలానికి చెందిన కవిత సతీష్ బెల్లం కూతురు, బెల్లం నిహాన పటేల్ (వేధ గాయత్రి) అండర్-11 విభాగంలో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు జనవరి 16 నుండి 19 వరకు పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జరగనున్నాయి. ప్రస్తుతం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని క్రీడా హాస్టల్‌లో కోచ్‌లు నరేందర్, దేవికల పర్యవేక్షణలో ఆమె శిక్షణ పొందుతోంది. ఈ ఎంపికతో ఇనుగుర్తి మండలానికి క్రీడారంగంలో గౌరవం లభించింది.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ఘనంగా ప్రారంభం

**స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 30 పెన్ పవర్:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్ లో 44 వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి, స్థానిక అన్నారం సర్పంచ్ మహేందర్ గౌడ్ హాజరయ్యారు. మొదటగా దిప ప్రజ్వలన చేసి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఒలంపిక్ జ్యోతి వెలిగించి, జిల్లాల వారీగా మార్చ్ ఫాస్ట్ నిర్వహించి, రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులకు స్వాగతం పలికారు.

## ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు పునీతులయ్యారు

**పాలకుర్తి, డిసెంబర్ 30 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామ స్వామి దేవాలయాలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువజాము నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సునీత, అర్చకులు విష్ణు శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, అభిలాష్ శర్మ, సత్యనారాయణ, ఆలయ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా పునీతులయ్యారు.

## స్త్రీ నిధి పేరుతో యాప్

**హైదరాబాద్, డిసెంబర్ 30 పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అసవరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది.

మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే మహిళలు లోన్ కోసం అప్లై చేసుకోవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అసవరం లేదు. ఇప్పటికే రుణం తీసుకున్నవారే కాకుండా కొత్తగా లోన్ తీసుకోవాలనుకునేవారు ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మహిళలు తాము నెలనెలా చెల్లించే వాయిదాల సొమ్మును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కొంతమంది తమ సభ్యులకు తెలియకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పుడు ప్రతీ మహిళ తాము చెల్లించిన డబ్బులు అకౌంట్లో పడ్డాయా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ డబ్బులు జమ కాకపోతే అధికారులను వెంటనే సంప్రదించవచ్చు. అలాగే గతంలో చెల్లించిన సొమ్మును బట్టి ఎంత రుణం వస్తుంది.. ?రుణం పొందిన తర్వాత స్టేటస్ ఏంటి..? ఎవరి దగ్గర పెండింగ్ ఉంది..? అనే అన్నీ వివరాలను స్త్రీ నిధి యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముంది.

**డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలంటే..?**

గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి అని సెర్చ్ చేయండి
మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోండి
ఫోన్ నెంబర్ టైప్ చేసి రిజిస్టర్ అవ్వండి
మీ సంఘం వివరాలు, లోన్ల వివరాలు చెక్ చేసుకోండి

## నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడికి సన్మానం



**మంచిర్యాల, డిసెంబర్ 30 పెన్ పవర్:** కడెం మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో ఇటీవల ఎన్నికైన నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లసెట్టి శేఖర్ ను మండల కేంద్రంలోని జనతా కార్యాలయానికి వచ్చినప్పుడు, రైతు నేత రాజేందర్ హపావత్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు.

## గుర్తుతెలియని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలింపు

**బెల్లంపల్లి, డిసెంబర్ 30 పెన్ పవర్:** కాగజనగర్ పట్టణంలో రైల్వే గేట్ సమీపంలోని మున్సిపల్ నాలిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని మార్వాడి యువ మంచ్ అధ్యక్షుడు అరుణ్ లోయ అంబులెన్స్ ఏర్పాటు చేసి సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మానవతా కార్యక్రమంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సహకరించారు. సమయానికి స్పందించిన యువత చర్యలను స్థానికులు ప్రశంసించారు.

## కాగజ్‌నగర్‌లో ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**చెన్నూరు, డిసెంబర్ 30 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మీ–చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 25 మంది హాజరుకాగా, వారిలో 8 మందికి శస్త్రచికిత్స అవసరమని తేలింది. డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని, ఈ శిబిరం ప్రతి కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆప్టమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్మికుల సమ్మెకు ఆర్ఎస్పీ మద్దతు

**సిర్పూర్, డిసెంబర్ 30 పెన్ పవర్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు 9వ రోజు సమ్మెకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. బడ్జెట్ లేదని అధికారులు జీతాలు చెల్లించలేమని చెబుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మున్సిపాలిటీల్లో సమస్య లేకపోయినా కాగజ్‌నగర్‌లో మాత్రమే జీతాల సమస్య ఎందుకుందని ప్రశ్నించారు. కార్మికుల జీతాలు, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## బారేగుడా గ్రామ పంచాయతీ తొలి గ్రామ సభ నిర్వహణ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 30 పెన్ పవర్:** కాగజ్‌నగర్ మండలం బారేగుడా గ్రామ పంచాయతీ తొలి గ్రామ సభ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు. ఉపసర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి విలాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామాభివృద్ధి దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**జగిత్యాల, డిసెంబర్ 30 పెన్ పవర్:** జగిత్యాల కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు.

## జగిత్యాల ప్రెస్ క్లబ్ నూతన సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు

**కోరుట్ల, డిసెంబర్ 30 పెన్ పవర్:** జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను, నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే (ఐజేయు) అనుబంధ జగిత్యాల ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్, ఉపాధ్యక్షులు ముసిపట్ల దేవేందర్, బద్దెనపల్లి మల్లేశం, శనిగరపు శ్రీనివాస్, కోశాధికారి బోయినపల్లి శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కడార్ల రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శులు బద్దం నారాయణరెడ్డి, గాజుల మహేష్, కార్యవర్గ సభ్యులు నీరటి గంగాధర్, కల్లెడ హరీష్, ఎల్ల క్రాంతి కుమార్, సామా మహేష్, వాసం రఘు, ఎండి సాబేర్, కట్కూరి సంతోష్, దిండిగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు కల్వకుంట్ల శుభాకాంక్షలు

**ధర్మపురి, డిసెంబర్ 30 పెన్ పవర్:** మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావును మల్లాపూర్ మండలం సాతరం గ్రామ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కిషన్ గౌడ్, ఉప సర్పంచ్ జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దామని తెలిపారు.

# దానం ధైర్యం ఏమిటీ...

**హైదరాబాద్, డిసెంబర్ 30, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం ఒక పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. సాంకేతిక అంశాల సాకుతో కొందరు ఎమ్మెల్యేలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, దానం నాగేందర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన తీసుకున్న నిర్ణయం, ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన రూలింగ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినప్పటికీ, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇందులో అందరి దృష్టి దానం నాగేందర్‌పైనే ఉంది. ఎందుకంటే ఆయన కేవలం పార్టీ కండువా కప్పుకోవడమే కాదు, ఏకంగా కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటుకు తిరుగులేని సాక్ష్యం.బిఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఉండి, మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం అనేది ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నేరుగా అనర్హతకు దారితీస్తుంది. స్పీకర్ నుంచి నోటీసులు అందినప్పటికీ దానం ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హంఅయితే, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. “నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్–ఎంఐఎం కలిసి 300 డివిజన్లలో గెలుస్తాయి” అని ఆయన ప్రకటించడం ద్వారా తన రాజకీయ గమ్యంపై స్పష్టత ఇచ్చేశారు. అంటే స్పీకర్ తనపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడకుండా, తానే ఒక అడుగు ముందుకేయాలని దానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.దానం నాగేందర్ ఇప్పుడు



రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. ప్రజల్లోకి నైతికతతో వెళ్ళినట్లు ఉంటుంది. ఉప ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసేందుకు అర్హత లభిస్తుంది. కోర్టు కేసులు, అనర్హత వేటు ముప్పు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.దానం నాగేందర్ కేవలం ఖైరతాబాద్‌కే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా తన పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. 300 డివిజన్లలో ప్రచారం చేస్తానని ప్రకటించడం ద్వారా, తాను కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ద్వారా తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని ఆయన ప్లాన్. ఒకవేళ దానం నాగేందర్ రాజీనామా చేసి ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే, అది

తెలంగాణ రాజకీయాల్లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపిం చుకోవడానికి ఇది ఒక పరీక్ష.దానం నాగేందర్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన అంశం కాదు. ఇది తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలకు దిక్సూచి. స్పీకర్ నిర్ణయం కంటే ముందే ఆయన రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగితే, అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది. దానం తీసుకునే ఈ బోల్డ్ స్టెప్ సక్సెస్ అయితే, మిగిలిన ఫిరాయింపు ఎమ్మె ల్యేలకు కూడా అది ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది.

# ఎయిర్ పోర్టుకు అంతా రెడీ...



**వరంగల్, డిసెంబర్ 30, పెన్ పవర్:**
దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనులు వేగవంతమయ్యాయి ఏఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూములను పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటికే 253 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించి, రూ. 295 కోట్ల పరిహారాన్ని రైతులకు అందజేసింది. దీంతో మొత్తం భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. జనవరి 2026లో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి విమాన సర్వీసులు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. అయోధ్య, కొచ్చిన్ విమానాశ్రయాల తరహాలో దీనిని అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు.తెలంగాణ రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విమాన సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా దశాబ్దాల కాలంగా నిరీక్షిస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనుల్లో ఒక కీలకమైన ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం.. సేకరించిన భూమిని అధికారికంగా భారత విమానయాన సంస్థకు అప్పగించింది.వరంగల్ జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసింది. శనివారం భారత విమానయాన సంస్థ హైదరాబాద్ జనరల్ మేనేజర్ బి.వి. రావు నేతృత్వంలోని బృందం మామునూరు ప్రాంతాన్ని సందర్శించింది. గతంలో ఈ విమానాశ్రయం పరిధిలో ఉన్న 696.14 ఎకరాలకు తోడు.. తాజాగా సేకరించిన 253 ఎకరాల ప్రైవేటు భూమిని కలిపి మొత్తం సుమారు 950 ఎకరాల భూమిని విమానాశ్రయ అథారిటీకి అప్పగించారు. రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ. 1.20 కోట్ల చొప్పున మొత్తం రూ. 295 కోట్లను పరిహారంగా చెల్లించింది. ఆర్బిట్రేషన్ ప్రక్రియ ద్వారా రైతుల అభ్యంతరాలను పరిష్కరించి.. ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా భూములను స్వాధీనం చేసుకుంది.రెవెన్యూ, రహదారుల శాఖ అధికారులతో కలిసి విమానయాన సంస్థ బృందం భూమి సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. త్వరలోనే ఈ భూమి బదలాయింపు పత్రాలను ప్రభుత్వం అధికారికంగా అందజేయనుంది. మామునూరు విమానాశ్రయాన్ని ఒక చిన్న విమానాశ్రయంగా కాకుండా.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయాన్ని ఎంత వేగంగా నిర్మించారో.. అదే వేగంతో దీనిని పూర్తి చేయాలని సంకల్పించింది. కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయం తరహాలో ఆధునిక వసతులు, పచ్చదనంతో దీనిని అలంకరించనున్నారు.ప్రస్తుతానికి ఉన్న చిన్న రన్‌వేను విస్తరించి.. ప్రారంభంలో 72 సీట్ల సామర్థ్యం ఉన్న చిన్న విమానాలను నడపనున్నారు. ప్రయాణికుల స్పందనను బట్టి పెద్ద విమానాలు దిగేలా రన్‌వేను మరింత అభివృద్ధి చేస్తారు.సాధారణంగా శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని ఒప్పందం ఉంది. కానీ.. ప్రభుత్వం ఈ నిబంధనల నుంచి మామునూరుకు మినహాయింపు తీసుకురావడంలో విజయం సాధించిందివరంగల్‌కు విమాన సౌకర్యం రావడం వల్ల ఉత్తర తెలంగాణ ఆర్థిక చిత్రం పూర్తిగా మారిపోనుంది. వరంగల్‌లో ఉన్న ఐటీ హబ్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఇది కొత్త ఊపిరి పోయనుంది. పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులు నేరుగా వరంగల్ చేరుకునే అవకాశం ఉండటంతో మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడిని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల స్థానిక రవాణా, హోటల్ వ్యాపారాలు పుంజుకుంటాయి. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది.నాలుగు దశాబ్దాల పాటు మూతపడి ఉన్న ఈ విమానాశ్రయాన్ని పునరుద్ధరించడానికి ఒక స్పష్టమైన కాలపరిమితిని ప్రభుత్వం నిర్ణయించుకుంది. 2026 జనవరి మాసంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంయుక్తంగా ఈ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి మొదటి విమానాన్ని గాల్లోకి ఎగురవేయడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే దీనికి అవసరమైన అన్ని రకాల క్లియరెన్సులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల పర్యవేక్షించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కావడంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణంలో ఒక అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. ఇది ఓరుగల్లు ప్రాంత అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలవబోతోంది.

# నిధుల వరద.. తర్వాత ఎన్నికలు...

**హైదరాబాద్, డిసెంబర్ 30, పెన్ పవర్:**
తెలంగాణలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కనుంది. ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ.. అదే ఉత్సాహంతో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలఎన్నికలకు సమరశంఖం పూరించేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థుల వార్షిక పరీక్షల సీజన్ ప్రారంభం కాకముందే.. అంటే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం జనవరి మూడో వారం నాటికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు పంపింది.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ఈ ఏడాది జనవరిలోనే గడువు ముగియడంతో ప్రస్తుతం ఇవి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మరోవైపు.. హైదరాబాద్ , ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ల గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువు ముగిసిన, ముగియనున్న అన్ని సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సర్కార్.. తాజాగా ఓఆర్ఆర్ పరిధిలోని

27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో జీహెచ్ఎంసీతో కలిపి మొత్తం 8 కార్పొరేషన్లు, 125 మున్సిపాలిటీలు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి. గడువు ఏప్రిల్ వరకు ఉన్న ఖమ్మం, వరంగల్ వంటి కొన్ని చోట్ల మాత్రం ప్రస్తుతానికి మినహాయింపు ఉండవచ్చుఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. జనవరి రెండో వారం నాటికి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడంతో పాటు, రాబోయే సాధారణ ఎన్నికలకు ముందే పట్టణ ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉందో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలను అధికార పార్టీ ఒక ‘సెమీఫైనల్’గా భావిస్తోంది.మరోవైపు.. ఎన్నికలకు ముందే ఓటర్లను ఆకట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధుల వర్షం కురిపిస్తోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అక్టోబరులోనే రూ. 2,780 కోట్లు విడుదల చేసింది. జీహెచ్ఎంసీ మినహా మిగిలిన అన్ని పట్టణ సంస్థల్లో సుమారు 2,432 అభివృద్ధి పనులు ఈ నిధులతో జరగనున్నాయి. కొత్త మున్సిపాలిటీలకు రూ. 15 కోట్లు, కొత్త కార్పొరేషన్లకు రూ. 30 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించి జనవరి చివరి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఇలా ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు ఎన్నికల వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పోరుకు సర్వం సిద్ధం చేస్తోంది.

# వైసీపీకి ప్రాణసంకటంగా పీపీపీ

**విజయవాడ, డిసెంబర్ 30, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల నిర్వహణపై పీపీపీ విధానం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రైవేటీకరణ గా అభివర్ణిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటరీ కమిటీల నుంచి ఈ విధానానికి లభిస్తున్న మద్దతు వైసీపీని ఇరకాటంలోకి నెట్టింది.ఏపీలో పది కొత్త మెడికల్ కాలేజీల నిర్వహణకు పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. ఇప్పటికే కోటి సంతకాల సేకరణతో ప్రజల్లోకి వెళ్లిన వైసీపీ, ఇది పేదల వైద్యానికి తీరని ద్రోహమని ఆరోపిస్తోంది. అయితే, ఈ పోరాటంలో ఆ పార్టీకి ఇప్పుడు స్వంత ఎంపీల నుంచి, అటు కేంద్రం నుంచి అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. వైద్య విద్యలో పీపీపీ విధానం మేలని పార్లమెంటరీ స్థాయి సంఘం స్పష్టమైన సిఫార్సులు చేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కమిటీలో వైసీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సభ్యుడిగా ఉన్నారు. ఈ అంశంపై టీడీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టిన గురుమూర్తి.. తాము పీపీపీని కేవలం కొత్త ప్రాజెక్టులకే సూచించామని, ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని వివరణ ఇచ్చారు. అయితే, కమిటీ నివేదికపై సంతకం చేసిన తర్వాత ఇప్పుడు బయట వ్యతిరేకించడం రాజకీయంగా వైసీపీకి కొంత ఇబ్బందికరంగా మారిందిపీపీపీ విధానాన్ని ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తున్న వైసీపీకి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రభుత్వానికి రాసిన లేఖ రూపంలో పరోక్షంగా గట్టి కౌంటర్ ఇచ్చారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, ఇది మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన సమర్థించారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టులకు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద 30 నుంచి 40 శాతం వరకు మూలధన సబ్సిడీని కేంద్రం అందిస్తుందని, నిర్వహణ వ్యయంలోనూ 25 శాతం భరిస్తామని ఏపీ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వైసీపీ చేస్తున్న అవినీతి ఆరోపణలు తేలిపోయినట్లయింది. ఇప్పుడు పీపీపీ విధానాన్ని



వైసీపీ వ్యతిరేకిస్తే బీజేపీపైనా ఆరోపణలు చేసినట్లే. కేంద్రంపై కూడా యుద్ధం చేసినట్లే. ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సఖ్యతగా ఉంటూ, రాష్ట్రంలో మాత్రం అదే బీజేపీ మద్దతు ఇస్తున్న విధానాలను వ్యతిరేకించడం వైసీపీకి సవాలుగా మారింది. ఇప్పటికి ఇప్పుడు బీజేపీని వ్యతిరేకిస్తూ వైసీపీ ఉద్యమాలు చేసే పరిస్థితుల్లో లేదు. అందుకే ఈ నిందను కేవలం చంద్రబాబుపైకి నెట్టేందుకే వైసీపీ మొగ్గు చూపుతోంది. అయితే ఇప్పుడు వెనక్కి తగ్గితే వైసీపీ పోరాటం నవ్వుల పాలవుతుంది. అందుకే పీపీపీ విధానం ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందదని, మెనేజ్మెంట్ కోటా సీట్లను రూ. 60 లక్షల వరకు అమ్ముకుంటారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఇప్పటికే గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన వైసీపీ, అవసరమైతే కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. మొత్తం మీద, ఒకవైపు కేంద్రం నుంచి 40% సబ్సిడీ హామీ , పార్లమెంటరీ కమిటీ క్లీన్ చిట్ ఉండటంతో, వైసీపీ చేస్తున్న ప్రైవేటీకరణ ప్రచారం క్షేత్రస్థాయిలో తేలిపోతోందన్న భావన వ్యక్తమవుతోంది.

# 100 పర్సెంట్ కనెక్టివిటీ దిశగా అడుగులు

**విశాఖపట్టణం, డిసెంబర్ 30, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో మొబైల్ కనెక్టివిటీపై ఫోకస్ పెట్టింది. మొబైల్ సిగ్నల్స్‌ను మెరుగుపరిచేందుకు సిద్ధమైంది.. మారుమూల ప్రాంతాల్లో కూడా సిగ్నల్స్ వచ్చేలా ప్లాన్ చేస్తోంది. దీని కోసం కొత్తగా 707 టవర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను గుర్తించి ఈ టవర్లు ఏర్పాటు చేస్తారు. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద ఈ వ్యాయాన్ని కేంద్రం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ టవర్లకు అవసరమైన స్థలాన్ని ఇస్తుంది.ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. కొత్తగా 707 సెల్ టవర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ సెల్ టవర్ల నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ భారత్ నిధి' పథకం ద్వారా భరిస్తుంది. అయితే, టవర్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఈ టవర్లను ఏర్పాటు చేస్తాయి. రాష్ట్రంలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. సెల్ ఫోన్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో, ఉన్న టవర్లు సరిపోవడం లేదు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో, అలాగే తరచుగా సిగ్నల్ సమస్యలు వచ్చే చోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రభుత్వం కొత్తగా టవర్లు నిర్మించాలని ఆలోచిస్తోంది. కొత్త టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ భూములు కూడా అవసరం అవుతాయి. కొన్ని చోట్ల టవర్ల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రిని తరలించడానికి సరైన రోడ్డు మార్గాలు కూడా లేవని అధికారులు గుర్తించారు. ఇది నిర్మాణ పనులకు అడ్డంకిగా మారుతోంది.అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలోని చాలా గిరిజన గ్రామాల్లో సెల్ ఫోన్ నెట్‌వర్క్ సరిగా పనిచేయడం లేదు. ఈ ఒక్క జిల్లాలోనే 100 కొత్త టవర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలో భాగంగా, అధికారులు ఇప్పటికే 42 ప్రదేశాలలో జాయింట్ సర్వేను పూర్తి చేశారు. మరో 13 స్థలాలను టవర్ల ఏర్పాటు కోసం సంబంధిత టెలికాం సంస్థలకు అప్పగించారు. ఈ చర్యల ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నారు.రాష్ట్రంలో నెట్‌వర్క్ వాడకం బాగా పెరిగిపోయింది. దీంతో తరచూ సిగ్నల్ సమస్యలు వస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. టవర్లు అందరికీ సరిపోవట్లేదు.. అందుకే, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి ముందుకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 4జీ సేవలను మెరుగుపరచడానికి 624 కొత్త టవర్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసింది. ఈ కొత్త టవర్లను ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు పరిశీలించారు. కొత్త జిల్లాల ఆధారంగా స్థలాలను గుర్తించారు. ఇప్పటికే 295 ప్రాంతాల్లో సర్వేలు పూర్తయ్యాయి. ఈ సర్వేల ఆధారంగా, 37 లొకేషన్లను టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ చర్యల వల్ల రాష్ట్రంలో సిగ్నల్ సమస్యలు తగ్గుతాయని ఆశిస్తున్నారు.

# పాపం.. ప్రవీణ్ ప్రకాష్...

**అమరావతి, డిసెంబర్ 30, పెన్ పవర్:**
ఏపీ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న తర్వాత, తిరిగి సర్వీసులోకి రావాలని కోరుకుంటూ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఒకప్పుడు చక్రం తిప్పిన ఈ అధికారి, ఇప్పుడు తన నిర్ణయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మీడియా ముందు వాపోవడానికి కారణం పోస్టింగ్ కోసమేనని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అత్యంత శక్తివంతమైన అధికారిగా వెలుగొందిన ప్రవీణ్ ప్రకాష్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారు. తన లేఖను సచివాలయం పోస్ట్ బాక్స్‌లో వేసి వెళ్ళిపోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆరేళ్ల సర్వీసు ఉండగానే తీసుకున్న ఈ నిర్ణయం తప్పని ఆయనకు ఏడాదిన్నర తిరగకముందే అర్థమైనట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన వివిధ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, తాను చేసిన తప్పులను ఒప్పుకోవడం, క్షమాపణలు కోరడం చూస్తుంటే.. ఆయనకు మళ్లీ ఐఏఎస్ హోదా కావాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది.నిబంధనల ప్రకారం, ఒక ఐఏఎస్ అధికారి సమర్పించిన విఆర్ఎస్ దరఖాస్తును ప్రభుత్వం ఆమోదించి, సదరు అధికారి రిలీవ్ అయిన తర్వాత దానిని వెనక్కి తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. సాధారణంగా విఆర్ఎస్ అమల్లోకి రాకముందే దానిని ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకసారి ప్రభుత్వం రాజీనామాను లేదా విఆర్ఎస్‌ను ఆమోదించిన తర్వాత, దానిని రద్దు చేసి తిరిగి సర్వీసులోకి తీసుకోవడం అనేది అరుదుగా, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే జరుగుతుంది. దీనికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అనుమతితో పాటు రాష్ట్ర ప్రభుత్వ బలమైన సిఫార్సు అవసరం.ప్రవీణ్ ప్రకాష్ సర్వీసులో ఉన్నప్పుడు తన తోటి ఐఏఎస్ అధికారులతో ప్రవర్తించిన తీరు ఇప్పుడు ఆయనకు పెద్ద శాపంగా మారింది. గత ప్రభుత్వంలో ఆయన అతి వల్ల ఇబ్బందులు పడ్డ అధికారులు, అవమానాలకు గురైన వారు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ వల్ల ఇబ్బందులకు గురైన సహచర అధికారులు, ఆయనను మళ్లీ వ్యవస్థలోకి రానివ్వడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఒక అధికారిపై ఇతర అధికారులందరిలోనూ ఇంత వ్యతిరేకత ఉండటం ఆయన పునరాగమనానికి ప్రధాన అడ్డంకిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణంగా అధికారుల పట్ల కక్షసాధింపు ధోరణితో ఉండరు. గతంలో చంద్రబాబుకు ప్రవీణ్ ప్రకాష్ సన్నిహితంగా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, గత ఐదేళ్లలో ఆయన వ్యవహరించిన తీరు, వ్యవస్థలను ప్రభావితం చేసిన విధానం చంద్రబాబుకు కూడా తెలుసు. ఇప్పుడు ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను మళ్లీ చేరదీస్తే అది ఇతర అధికారులకు తప్పుడు సంకేతాలు పంపుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతానికి ప్రవీణ్ ప్రకాష్ చేస్తున్న ప్రయత్నాలు అరణ్య రోదనగానే కనిపిస్తున్నాయి. ఒక అధికారిగా ఆరేళ్ల సర్వీసును వదులుకుని బయటకు వచ్చిన తర్వాత, ఇప్పుడు మీడియా వేదికగా తన బాధను చెప్పుకోవడం వల్ల సానుభూతి కంటే విమర్శలే ఎక్కువగా వస్తున్నాయి. ప్రభుత్వం ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు దాదాపు శూన్యమని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. అటు నిబంధనలు సహకరించకపోవడం, ఇటు రాజకీయంగానూ, అధికారికంగానూ మద్దతు లేకపోవడంతో ప్రవీణ్ ప్రకాష్ వీఆర్ఎస్ అధికారి హోదాలోనే మిగిలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు ఇప్పటివరకు రైలు ఎప్పుడు వస్తుందనే దానిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బొబ్బిలి, పార్వతీపురం రైల్వే స్టేషన్‌లను సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులు, మే నెలలో సాలూరుకు రైలు వస్తుందని చెప్పారు. కానీ, ఆ మాట కూడా తప్పింది. ఏడాది పూర్తవుతున్నా రైలు సేవలు పునరుద్ధరించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, కేంద్రం స్పందించి రైలును నడపాలంటున్నారు. తమ ప్రయాణ అవసరాలు తీర్చే రైలు సేవలను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

# దేశంలో 880 టన్నుల బంగారం

**ముంబై, డిసెంబర్ 30, పెన్ పవర్:**
మన దేశంలో బంగారానికి ఎంత డిమాండ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చైనా తర్వాత ఎక్కువగా బంగారాన్ని వినియోగించే దేశంగా భారత్ ఉంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం దేశ ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ.. ఏకంగా దేశ జీడీపీనే మించిపోయిందని తెలుస్తోంది. ప్రజల వద్దే కాకుండా ఇంకా రిజర్వ్ బ్యాంక్ దగ్గర కూడా బంగారం నిల్వలు విశేషంగా ఉన్నాయని చెప్పొచ్చు. ఇదంతా కలిపితే ఇంకా ఎక్కువే ఉంటుందిబంగారానికి.. భారతీయులకు విడదీయరాని సంబంధం ఉంది. పురాతన కాలం నుంచి భారతీయులకు బంగారం అంటే అమితమైన ఆసక్తి. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాల్ని విశేషంగా కొనుగోలు చేసి ధరిస్తుంటారు. పండగలు, శుభకార్యాలు, వివాహాలు ఇతర ప్రత్యేక సందర్భాల సమయంలో డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటుంది. బంగారు ఆభరణాలు మహిళల అందాన్ని మరింత పెంచుతుందని చెబుతుంటారు. సమాజంలో హోదాను కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే.. ప్రతి ఇంట్లో ఎంతో కొంత బంగారం ఉంటుంది. అనిశ్చితి, సంక్షోభాల వేళ బంగారం సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పనిచేస్తుందని నమ్ముతారు. అందుకే.. తమ దగ్గర ఉన్న డబ్బుతో చిన్న చిన్న మొత్తాల్లో కూడా కొనుగోలు చేసి కూడబెడుతుంటారు. అయితే ఇప్పుడు భారతీయుల వద్ద ఉన్న బంగారం విలువ .. సరికొత్త మైలురాయిని తాకింది.ప్రజల వద్ద ఉన్న మొత్తం బంగారం విలువ.. ఇప్పుడు భారత స్థూల దేశీయోత్పత్తినే మించిందని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల ఇంట్లో ఉన్న బంగారం విలువ కూడా విపరీతంగా పెరిగిందని చెప్పొచ్చు. భారతీయ ప్రజల వద్ద సుమారుగా 34 వేల నుంచి 35 వేల టన్నుల వరకు బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా.ఇంటర్నేషనల్ మార్కెట్లో కిలో బంగారం ధర 1,46,000 డాలర్ల మార్కు దాటింది. ఇదే టన్నుకు (1000 కిలోలు) చూస్తే దీని విలువ 14,60,00,000 డాలర్లకు చేరుకుంది. 34,500 టన్నుల బంగారం ధర చూసినా ఇది సుమారు 5 ట్రిలియన్ డాలర్ల మార్కును అధిగమించింది. ట్రిలియన్ అంటే లక్ష కోట్లు. అంటే ప్రజల వద్ద బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల మార్కు దాటేసింది. ఇది భారత కరెన్సీలో చూస్తే సుమారు రూ. 450 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇక మన దేశ జీడీపీ 4 ట్రిలియన్ డాలర్లుగా ఉందని అంచనా. ఇది దాదాపు రూ. 360 లక్షల కోట్ల వరకు ఉంటుందని చెప్పొచ్చు. అంటే.. జీడీపీ కంటే భారత ప్రజల దగ్గర ఉన్న బంగారం విలువ దాదాపు 1.25 రెట్లు ఎక్కువగా ఉంది. ఈ అక్టోబర్ నెలలో భారతదేశ జీడీపీలో



భారతీయుల దగ్గర ఉన్న బంగారం విలువ 88.8 శాతంగా ఉండగా.. ఇటీవల బంగారం రేట్లు విపరీతంగా పెరగ్గా ఇప్పుడు జీడీపీనే మించిపోయిందని చెబుతున్నారు. భారత్ తమ అవసరాల కోసం, ప్రజల డిమాండ్‌కు తగ్గట్లుగా అందుబాటులో ఉంచేందుకు ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటుందని చెప్పొచ్చు. ఇంకా బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాల్లో చైనా తర్వాత రెండో స్థానంలో ఉంది ఇండియా. ప్రజల దగ్గర మాత్రమే కాకుండా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర కూడా సుమారు 880 టన్నుల మేర పసిడి నిల్వలు ఉన్నాయి.

## హైస్పీడ్ కనెక్టివిటీతో ట్రాఫిక్ ఫ్రీ ట్రంక్ రోడ్లు

**అమరావతి, డిసెంబర్ 30, పెన్ పవర్:** ఆధునిక సౌకర్యాలతో ప్రధాన రహదారుల నిర్మాణం వేగవంతమైంది. హైస్పీడ్ కనెక్టివిటీ లక్ష్యంగా, 50-60 మీటర్ల వెడల్పుతో ఆర్టీరియల్ రహదారులను నిర్మిస్తున్నారు. ఈ-11, ఈ-13, ఈ-15 రహదారులను జాతీయ రహదారి 16తో అనుసంధానం చేస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3) నిర్మాణం, వరద నీటి నియంత్రణ వ్యవస్థ, తాగునీటి పైపులు, డ్రైనేజీ, విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రధాన రహదారుల నిర్మాణం వేగవంతమైంది. రాబోయే వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా విశాలంగా, ఆధునిక సౌకర్యాలతో ఈ రోడ్లను నిర్మిస్తున్నారు. హైస్పీడ్ కనెక్టివిటీతో పాటుగా అందించడమే లక్ష్యంగా ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా ఉండేందుకు 50 నుంచి 60 మీటర్ల వెడల్పుతో ఆర్టీరియల్ రహదారులను నిర్మిస్తున్నారు. ఆర్టీరియల్ రహదారులు అంటే నగరంలో ముఖ్యమైన ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారులు. భవిష్యత్తులో వచ్చే ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేపడుతున్నారు. రోడ్లు చాలా విశాలంగా, అన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు.అమరావతిలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి అనేక రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఈ-11, ఈ-13, ఈ-15 రహదారులను జాతీయ రహదారి 16తో అనుసంధానం చేస్తున్నారు. అమరావతికి సులభంగా చేరుకోవడానికి, 9 వరుసలతో కూడిన సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3)ను నిర్మిస్తున్నారు. ఈ రహదారుల కింద వరద నీటిని అదుపు చేసే వ్యవస్థ, తాగు నీటి పైపులు, డ్రైనేజీ, విద్యుత్తు లైన్లు, ఇంటర్‌నెట్ కేబుల్స్ వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులన్నీ చాలా వేగంగా జరుగుతున్నాయి. ఎన్-7 రహదారిపై ఒక వంతెన నిర్మాణం కూడా జరుగుతోంది. అనంతవరం అనే ప్రాంతం దగ్గర ఈ-5 రోడ్డు నిర్మాణం కూడా వేగంగా పురోగమిస్తోంది. ఈ-3 రోడ్డును ప్రకాశం బ్యారేజ్ దగ్గర మంగళగిరి రోడ్డుతో కలపాలని ఏడీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులను 2026 ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని అనుకుంటున్నారు. దీని కోసం తాడేపల్లి దగ్గర ఒక స్టీల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు.ఏడాదిలో ప్రధాన రహదారులన్నీ ఒక రూపు సంతరించుకుంటాయి. ప్రస్తుతం ట్రంక్ రోడ్ల నిర్మాణాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ట్రంక్ రోడ్లు అంటే ప్రధానమైన, ఎక్కువ రద్దీ ఉండే రహదారులు. ఈ రహదారుల నిర్మాణంతో పాటు, వాటి కింద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు' అని ఏడీసీఎల్ సీఈ తెలిపారు.

## సాలూరుకు ట్రైన్ కల తీరినట్టేనా

**విజయనగరం, డిసెంబర్ 30, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర ప్రాంతానికి రైలు కనెక్టివిటీ ఉంది.. కానీ ఆ చిన్న పట్టణానికి మాత్రం రైల్వే స్టేషన్ ఉన్నా ప్రజలు రైలు కోసం ఎదురు చూస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు రైల్వే స్టేషన్‌కు రైలు నడిపేందుకు ట్రయల్ రన్ నిర్వహించి ఏడాది దాటినా.. ఇప్పటి వరకు రైలు సేవలు ప్రారంభం కాలేదు. కరోనా సమయంలో నిలిపివేసిన రైలు బస్సును కూడా పునరుద్ధరించలేదు.. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.గతంలో సాలూరు, బొబ్బిలి పట్టణాల మధ్య రైలు బస్సు సేవలు అందుబాటులో ఉండేవి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఉండే ఈ సేవలు కూలీలకు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేవి. విద్యార్థులు కూడా బొబ్బిలికి వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించేవారు. సాలూరు, బొబ్బిలి ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. అయితే, కరోనా కాలం నుంచి ఈ రైలుబస్సు సేవలను పూర్తిగా నిలిపివేశారురైలు బస్సు సేవలు నిలిచిపోవడంతో, ఈ రెండు పట్టణాల మధ్య ఉన్న అనేక గ్రామాల ప్రజలు విశాఖ, విజయనగరం వంటి నగరాలకు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా, సాలూరు-బొబ్బిలి రైలుబస్సు సేవలు పునరుద్ధరించబడలేదు. ఈ నేపథ్యంలో, రైలుబస్సు సేవలను తిరిగి ప్రారంభించాలని ప్రజలు రైల్వే అధికారులను, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ సేవలను పునరుద్ధరిస్తే, ఎంతో మంది ప్రయాణికులకు ఉపశమనం లభిస్తుంది.సాలూరు నుంచి రాయగడ, విశాఖపట్నం వరకు రైలు నడపాలని 2018లో స్థానికులు కోరడంతో రైల్వే అధికారులు స్పందించారు. స్టేషన్ అభివృద్ధి, రోడ్డు పనులు, షెల్టర్ ఏర్పాటు, విద్యుత్ లైన్ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. గతేడాది అక్టోబరులో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినా, ఏడాది గడిచినా రైలు సేవలు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.2018లో సాలూరుకు వారు రైలు కోసం రిక్వెస్ట్ చేశారు. సాలూరు నుంచి రాయగడ, విశాఖపట్నం వరకు రైలు నడపాలని వారు కోరారు. వారి అభ్యర్థన మేరకు, అప్పటి డీఆర్ఎం సాలూరు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ అభివృద్ధి, దండిగాం రోడ్డు, కొత్త షెల్టర్ ఏర్పాటు, విద్యుత్ లైన్ పనుల కోసం నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నీ పూర్తయ్యాయి. గత ఏడాది అక్టోబరు మొదటి వారంలో విశాఖపట్నం నుంచి సాలూరు రైల్వే స్టేషన్‌కు ఒక రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ రైలు కూత విని పట్టణ ప్రజలు ఎంతో సంతోషించారు. పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయితే, ట్రయల్ రన్ పూర్తయి సంవత్సరం దాటినా, రైలు సేవలు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి.

## వైసీపీ అంటే అంతే...విరాళాల జోరు

**కడప, డిసెంబర్ 30, పెన్ పవర్:** :రాజకీయాల్లో అధికారం ఎక్కడ ఉంటే అక్కడ నిధుల ప్రవాహం ఉండటం సహజం. కార్పొరేట్ సంస్థలైనా, వ్యక్తిగత దాతలైనా అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతుంటారు. కానీ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రంలో ఈ సహజ సూత్రం తలకిందులైంది.



2024 సార్వత్రిక ఎన్నికల్లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఘోర పరాజయాన్ని చవిచూసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, విరాళాల సేకరణలో మాత్రం అధికార కూటమికి అందనంత ఎత్తులో నిలిచింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన 2024-25 వార్షిక నివేదిక గణాంకాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.2024 ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితమై, ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోలేకపోయింది. పార్టీ పని అయిపోయిందంటూ విశ్లేషణలు వెలువడ్డాయి. కానీ, ఆర్థికంగా ఆ పార్టీకి ఉన్న బలం ఏమాత్రం తగ్గలేదని తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వైసీపీకి ఏకంగా రూ.140.03 కోట్ల విరాళాలు వచ్చాయి. మరోవైపు, అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీకి ఈ కాలంలో వచ్చిన విరాళాలు రూ.83 కోట్లు మాత్రమే. ఇక కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీకి రూ.25.33 కోట్లు సమకూరాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన రెండు పార్టీల విరాళాల మొత్తం రూ.108 కోట్లు కలిపినా, ఒక్క వైసీపీకి వచ్చిన విరాళాల కంటే తక్కువే కావడం గమనార్హం.సాధారణంగా ఎన్నికల సంవత్సరం లేదా అధికారం మారిన కొత్తలో పాలక పక్షానికి విరాళాలు వెల్లువలా వస్తాయి. కానీ, టీడీపీ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. 2023-24తో పోల్చితే, టీడీపీ అధికారంలోకి వచ్చిన 2024-25లో ఆ పార్టీకి వచ్చిన విరాళాలు తగ్గడం విస్మయం కలిగిస్తోంది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ అంటే జూన్ 2024 చాలా మంది దాతలు తటస్థంగా ఉండటం లేదా అప్పటికే అధికారంలో ఉన్న వైసీపీ గెలుస్తుందనే అంచనాతో ఆ పార్టీకే నిధులు మళ్లించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ గణాంకాలు కేవలం ఎన్నికల తర్వాత వచ్చినవే కాకుండా, ఎన్నికల ముందు ఏప్రిల్-మే 2024 సమయంలో ఇచ్చినవి కూడా కలిపి ఉంటాయని గమనించాలి.విరాళాల విషయంలో తమకు లభించిన ఆధిక్యాన్ని వైసీపీ ఒక నైతిక విజయంగా చెప్పుకుంటోంది. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, తమ పార్టీపై ప్రజలకు, పారిశ్రామికవర్గాలకు, అభిమానులకు నమ్మకం సడలలేదని ఈ నిధులే నిదర్శనమని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వచ్చిన ఈ విరాళాలు, క్యాడర్ లో జోష్ నింపడానికి ఉపయోగపడుతున్నాయి. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేయడానికి, న్యాయపరమైన పోరాటాలకు, సంస్థాగత నిర్మాణం కోసం ఈ నిధులు ఉపయోగపడతాయని వారు భావిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## రూ.2.7 లక్షల కోట్ల పరిహారం ఇవ్వండి!



**హైదరాబాద్ పెన్ పవర్:** రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య బ్రిటిష్ సంస్థ బీపీ నుంచి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 2.7 లక్షల కోట్ల)కు పైగా పరిహారాన్ని భారత ప్రభుత్వం కోరుతోందని తెలుస్తోంది. చమురు–గ్యాస్ వెలికి తీసేందుకు కేజీ–డీ6 క్షేత్రాల్లో ఈ భాగస్వామ్య కంపెనీలు అవసరమైన దానికంటే భారీ ప్లాంట్లు నిర్మించాయని, అయినా సహజ వాయువు ఉత్పత్తి లక్ష్యాలను చేరడంలో విఫలమయ్యాయని ప్రభుత్వం ఆరోపించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నవంబరు 7న త్రిసభ్య మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు కోరినట్లు తెలుస్తోంది. 14 ఏళ్ల నాటి ఈ వివాదానికి సంబంధించిన వాదనలు అదే రోజున ముగిశాయి. కొత్త ఏడాదిలో ట్రైబ్యునల్ తన తీర్పు ఇవ్వొచ్చు. ఈ వివాదంలో ఓడిపోయిన వర్గం, సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉందనీ సమాచారం. ఉత్పత్తి చేయని గ్యాస్ విలువతో పాటుబీ ఇన్‌స్టలేషన్, ఇంధన మార్కెటింగ్‌పై చేసిన వ్యయాలు, వాటిపై వడ్డీలనూ పరిహారం కింద కేంద్రం కోరిందని, ఈ మొత్తం విలువ 30 బి. డాలర్లపైనే ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ చీఫ్ ఖలీదా జియా (80) కన్నుమూశారు. (డిసెంబర్ 30) తెల్లవారుజామున ఆమె మరణించినట్లు బీఎన్‌పీ ప్రకటించింది. ఖలీదా జియా గత కొంతకాలంగా వయోభారం, సిర్రోసిస్, ఆర్థరైటిస్, డయాబెటిస్, గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు నవంబర్ 23న ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. బంగ్లాదేశ్, యూకే, యూఎస్, చైనా, ఆస్ట్రేలియాకు చెందిన వైద్య నిపుణుల బృందం ఆమెకు చికిత్స అందించారు. 36 రోజులుగా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతోన్న ఆమె ఆరోగ్యం విషమించడంతో డిసెంబర్ 29న () తుది శ్వాస విడిచారు. బంగ్లాదేశ్ మాజీ రాష్ట్రపతి రెహమాన్ భార్య ఖలిదా జియా. ఆమె 1991–96, 2001–06 మధ్య పదేళ్ల పాటు బంగ్లా ప్రధానిగా పని చేశారు. బంగ్లాదేశ్ చరిత్రలో ఖలీదా జియానే మొదటి మహిళా ప్రధానమంత్రి. ప్రస్తుతం తన భర్త స్థాపించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) చైర్ పర్సన్‌గా ఆమె ఉన్నారు. ఖలీదా జియా మరణంపై పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఇటీవలే ఆమె కుమారుడు తరీఖ్ రెహమాన్ తల్లిని చూసేందుకు 15 ఏండ్ల తర్వాత బ్రిటన్ నుంచి బంగ్లాదేశ్ తిరిగొచ్చారు. 2026 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖలీదా జియా మరణించడం ఆ దేశ రాజకీయాల్లో తీవ్ర ప్రభావం చూపించనుంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్ రాజకీయాల్లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. నోబెల్ అవార్డ్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతఅత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీపై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## 'శాంతి ఒప్పందం'పై అదే సందిగ్ధత



**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్య త్వరలోనే శాంతి ఒప్పందంపై అదే సందిగ్ధత కొనసాగుతోంది. అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య తాజాగా జరిగిన సమావేశంలోనూ ఈ ఒప్పందం ఖరారు కాలేదు. అయితే ఈ ఒప్పందానికి అతి చేరువగా ఉన్నామని ఇరు నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు ఆదివారం ఫ్లోరిడాలోని మార్–ఏ–లాగో ఎస్టేట్‌లో సమావేశమయ్యారు. అనంతరం జెలెన్‌స్కీతో కలిసి ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రష్యా, ఉక్రెయిన్ దేశాలు శాంతి ఒప్పందానికి చేరువయ్యాయని తెలిపారు. అంతకుముందు ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించారు. యుద్ధానికి ముగింపు పలికే విషయంలో ఎంతో పురోగతి సాధించామని ట్రంప్ చెప్పారు. గత వారం ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికపై 90 శాతం అంగీకారం కుదిరిందని జెలెన్‌స్కీ అన్నారు. ఉక్రెయిన్‌కు 15 ఏళ్లపాటు భద్రతా హామీని అమెరికా ఇచ్చిందని జెలెన్‌స్కీ తెలిపారు. కానీ, తాము 50 ఏళ్ల పాటు అమెరికా నుంచి భద్రతా హామీని ఇష్టపడతామని చెప్పారు. సరైనా భద్రతా హామీలు లేకుండా సంఘర్షణ ముగియదని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు.

## చైనాలో కంబోడియా, థాయిలాండ్ మంత్రుల భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కంబోడియా, థాయిలాండ్ శాంతి చర్చల నిమిత్తం ఆ దేశాల మంత్రులు చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో రెండు రోజుల పాటు ఈ సమావేశమయ్యారు.. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు జరిగిన తరువాత ఈ భేటీ జరగడం గమనార్హం. అలాగే, ఈ సమావేశం చైనా రాజధానిలో కాకుండా సరిహద్దులకు దగ్గరగా ఉన్న యునాన్‌లో జరగడం విశేషం. ఇది ఆగేయాసియాకు, వివాదాలు జరుగుతున్న ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. ఈ త్రైపాక్షిక సమావేశానికి మధ్యవర్తిగా చైనా వ్యవహరించింది. థాయిలాండ్ మంత్రి సిహాసక్ పువాంగ్కెట్కియో, కంబోడియా మంత్రి ప్రాక్ సోఖోన్‌లతో సమావేశం తరువాత చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉమ్మడి ప్రయత్నాలకు పిలుపునిచ్చారు. యుద్ధ పరిస్థితులు తలెత్తకుండా, ఉద్రిక్తతలను తగ్గించుకోవడాని ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు. అయితే గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నా దాడులు ఆగలేదు. తాజాగా చైనా చొరవతో రెండు దేశాల నేతలు శాంతిని నెలకొల్పుతామని ప్రకటించడం గమనార్హం.

# దాతృత్వానికి ప్రతిరూపం బుడ్డా వెంగళరెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలోని ఉయ్యాలవాడ గ్రామం ఇరువురు విశిష్ట వ్యక్తులకు జన్మ స్థలంగా నిలిచింది. బ్రిటిషు వారి నెదిరించి 1846లో ఉరికంబ మెక్కిన ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఒకరైతే, 1900 సంవత్సరంలో తుది శ్వాస వరకూ మూర్తీభవించిన దాతృత్వంగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి మరొకరు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారితో పోరాడి పేరు తెచ్చుకుంటే, ప్రభు త్వంతో సఖ్యతగా మెలుగుతూనే ప్రజలకు సేవ చేశాడు అదే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగళరెడ్డి. తన దాతృ త్వంలో అప్పటి బ్రిటీష్ రాణి క్వీన్ విక్టోరియానే ఆకట్టుకున్న వ్యక్తి బుడ్డా వెంగళరెడ్డి. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని 'రేనాడు సూర్యుడు' అంటారు. బుడ్డ వెంగళ రెడ్డిని 'రేనాటి చంద్రుడు' అంటారు. సిపాయిల తిరుగుబాటుకు ముందే తెల్ల దొరల తలలు తెగిన అరివీర భయం కరుడు నరసింహారెడ్డి అయితే ఎముకలేని చేయి కలిగి అభినవ దానకర్ణుడు అని పేరెన్నిక గన్నారు వెంగళ రెడ్డి. బుడ్డా వెంగళరెడ్డి (జనవరి 1, 1840 – డిసెంబరు 31, 1900) కర్నూలు జిల్లా, ఉయ్యాలవాడ గ్రామంలో సంపన్న రైతు కుటుం బంలో నల్లపురెడ్డి, వెంకటమ్మ దంపతులను జన్మించారు. పెద్దగా చదవక పోయినా తల్లినుండి దానగుణాన్ని, దాని గొప్పదనాన్ని గ్రహించారు. సంతానం కలుగ నందున తన తమ్ముని కుమారుని దత్తత తీసుకున్నారు. బాల్యం నుండే దానగుణం ఆయన వెంట నడిచింది. ఆపన్నులకు ఆసరా అందించడమే ఆయనకు నిత్య కృత్యంగా మారింది. కరవు బారిన పడిన పేదలకు తన ఆపన్న హస్తం చాచి కడుపు నిండా అన్నం పెట్టి కలియుగ దానకర్ణుడని పేరుపొందిన బుడ్డా వెంగళరెడ్డి. తనకు ఉన్నాదంతా దానం చేసిన మహానుభావుని దాతృత్వానికి పరాయి పాలకులు సైతం ఆశ్చర్య పోయారు. అందుకే విక్టోరియా మహారాణి ఆయన సేవలను గుర్తించి బంగారు పతకాన్ని బహుమానంగా ఇచ్చింది. బుడ్డ వెంగళరెడ్డి (1840 – 1900) 1866 కాలంలో సంభవించిన డొక్కల కరువు కాలంలో తన ఆస్తినంతా ధారపోసి ఎంతోమంది ప్రాణాల్ని కాపాడిన మహా దాత. పలు ప్రాంతాల నుండి తండోప తండాలుగా ఉయ్యాలవాడ చేరి రెడ్డిని ఆశ్రయించారు. వారి దీన స్థితిని అర్థంచేసుకున్న రెడ్డి ఇంట్లో ఉన్న ఆరు పుట్ల ధాన్యాన్ని గంజి కాయించి వేలాది కుటుంబాల ఆకలి తీర్చారు. పూటకు ఎనిమిది వేలకు తక్కువ కాకుండా ఈ కరవు కాలంలో బుడ్డ వెంగళరెడ్డి కరవు పీడితులైన ప్రజలకు మూడు నెలల పాటూ అన్న వస్త్రాలు ఇచ్చి కన్న తండ్రి లాగా కాపాడాడు. రాయల సీమలో పుట్టిన అపర దానకర్ణుడు వెంగళరెడ్డి. వంటమనిషి గంగన్న ఆకాలంలో చేసిన సేవలకు మెచ్చిన రెడ్డి అతనికొక బంగారు కడియం తొడిగి సత్కరించారు. అనంతర కాలంలో స్వగ్రామంలో పాఠశాలను నెలకొల్పి విద్యాదానం చేశారు. రెడ్డి సేవలను గుర్తించి విక్టోరియా బంగారు పతకాన్ని బహూక రించింది. ఢిల్లీలో 1877 జనవరి 1వ తేదీన జరిగిన సన్మాన సభలో బంగారు పతక బహూకరణ జరిగింది. ఆ బంగారు పతకముపై క్రింది విధంగా చెక్కబడింది. "1866వ సంవత్సరంలో సంభవిం చిన క్షామకాలమందు, నిరాధా రంగా నుండిన, తన స్వదేశస్థుల పట్ల జరిపించిన ఉత్కృష్ట ఔదార్యం నకు హర్ మైజెస్టి రాణిగారి వల్ల చేయబడిన శ్రేష్టమైన గణ్యతకు ఆనవాలుగా బుడ్డా వెంగళరెడ్డి గారికి బహుమాన మివ్వబడినది." ప్రభుత్వం ఈయన్ను ప్రొవిన్సియల్ జ్యూరీ యొక్క సభ్యునిగానూ, మద్రాసు గవర్నరు కౌన్సిల్ గౌరవ సభ్యుని గానూ చేసింది. ఆయన చేసిన దానాలు

అపూ ర్వాలు, అసమానాలు, నిత్య జ్ఞాపకాలు. రెడ్డి ప్రతి సంవత్సరం శివరాత్రి నాడు స్వగ్రామంలోని అగస్తేశ్వర దేవాలయంలో ఉత్సవాలు జరిపి, పండితులను సత్కరించి, అన్న దానాలు చేసేవారు. మహాదాతగా పేరుగాంచిన వెంగళ రెడ్డి 1900 డిసెంబరు 31న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన కీర్తి ఆచంద్రతారార్కంగా నిలుస్తుంది. ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలు వివిధ జానపద కళలలో ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తుం టారు. వెంగళరెడ్డి దాతృ త్వమూ కావ్యవస్తువు అయ్యింది. జాన పదులు వెంగళరెడ్డి మీద పాటలు కట్టి పాడుకున్నారు. కవులు, రచయి తలు కావ్యాలు, నవలలు, నాట కాలు, బుర్రకథలు రచిం చారు. ఎందరో పరిశోధనలు చేశారు. బుడ్డా వెంగళరెడ్డి దాన గుణం , గొప్పతనం గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# ఆధునిక భారతదేశానికి రూపశిల్పి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందిం చిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రా ష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతి భతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్. వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కర ణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడంలో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. బ్రిటీష్, భారతీయ అధికారులచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలంలోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్స రాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగంలో చేరాడు. 1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు. స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాలయంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహిం చాడు. 1942–47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు. 1947–51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమించ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళి కకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొం దించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధించిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం. భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నాయ ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా అంగీక రించారు. మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడంపై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహరించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారితీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

# కఠిన వాతావరణ పరిస్థితులతో పాలస్తీనియన్ల అవస్థలు

**హైదరాబాద్ పెన్ పవర్:** గాజాలో కఠినమైన వాతావరణ పరిస్థితులతో స్థానభ్రంశమైన పాలస్తీనియన్లు తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నారని గవర్నమెంట్ ఆపరేషన్స్ ఫర్ ఎమర్జెన్సీ ఇంటర్వెన్షన్స్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గాజాస్ట్రిప్‌లో కఠిన వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి, స్థానభ్రంశమైన కుటుంబాల ఆశ్రయం కోసం సుమారు 2,00,000 ముందుగా నిర్మితమైన గృహాలు (సులభంగా తరలించగలిగేవి) అవసరమని ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ప్రజలకు అవసరమైన మానవతా సాయాన్ని అనుమతించేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావా లని డిమాండ్ చేసింది. ఇటీవల తుఫాను కారణంగా వరదలు ముంచెత్తడంతో వేలాది శిబిరాలు ధ్వంసమయ్యాయని ఆప్రకటన తెలిపింది. ఇజ్రాయిల్ మారణహోమం కారణంగా ఇప్పటికే పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న క్లిష్టమైన అత్యవసర మానవతా పరిస్థితులను ప్రకృతి విపత్తులు మరింత తీవ్రతరం చేశాయని పేర్కొంది. ముఖ్యంగా తీరప్రాంతమైన అల్–రషీద్ స్ట్రీట్‌లో విధ్వంసం సృష్టించిందని, సుమారు 26 కిలోమీటర్ల విస్తీర్ణంలో

సముద్రపు తీరాన ఉన్న తాత్కాలిక శిబిరాలు తుడిచి పెట్టుకుపోయాయని తెలిపింది. సహాయ సంస్థల ప్రతిస్పందన సామర్థ్యం కూడా రాజీపడిందని ఆ ప్రకటన పేర్కొంది. సామాగ్రి కొరత, సాయంపై కొనసాగుతున్న ఇజ్రాయిల్ ఆంక్షలతో స్థానభ్రంశం చెందిన పాలస్తీనియన్ల డిమాండ్లను తీర్చడం అసాధ్యమని తెలిపింది..

# మెక్సికోలో పట్టాలు తప్పిన ఇంటర్ ఓషియానిక్ రైలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర అమెరికా దేశం మెక్సికోలోని ఓక్సాకా రాష్ట్రంలో ఇంటర్ ఓషియానిక్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. 98 మంది గాయపడ్డారు. ఓక్సాకా, వెరాక్రూజ్ రాష్ట్రాలను కలిపే ఇంటర్ ఓషియానిక్ రైలు నిజాండా పట్టణం సమీపంలోని ఒక మలుపు వద్ద పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. సమాచారం అందగా హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. మెక్సికో నేవీ తెలిపిన వివరాల ప్రకారం ప్రమాద సమయంలో రైలులో 250 మంది ప్రయాణిస్తున్నారు. వారిలో 241 మంది సాధారణ ప్రయాణికులు, తొమ్మిది మంది రైల్వే సిబ్బంది ఉన్నారు. రైలు పట్టాలు తప్పడంతో బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 13 మంది మరణించినట్టు అధికారులు ధ్రువీకరించారు. క్షతగాత్రుల సంఖ్య 98కి చేరింది. వీరిలో 36 మందికి ఆస్పత్రిలో అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. 139 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు స్పందించారు. సమాచారం అందుకున్న మెక్సికో నేవీ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. దాదాపు 360 మంది నావికాదళ సిబ్బంది రంగంలోకి దిగారు. రెస్క్యూ ఆపరేషన్ కోసం 20 వాహనాలు, 4 అంబులెన్సులు, 3 ఎయిర్ అంబులెన్సులను మోహరించారు. పరిస్థితులను సమీక్షించడానికి ఒక టాక్టికల్ డ్రోన్‌ను కూడా వాడారు. బోగీల మధ్య ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను దగ్గరలోని మతియాస్ రొమేరో, సెలినా క్రజ్, జుచిటాన్, ఇక్స్‌టెపెక్ ప్రాంతాల్లోని ఐఎంఎస్ఎస్ ఆస్పత్రులకు తరలించారు.

## ఘోర ప్రమాదం: ఏడుగురు మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్‌లో తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. బస్సు అదుపుతప్పి లోయలోపడిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఈరోజు తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలోలో ఏడుగురు మృతి చెందగా.. మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీయడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహత్ మీదుగా రాంనగర్‌కు వెళుతుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ప్రైవేటు రుణాల సెటిల్‌మెంట్ల కేసులో ఇడి దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రైవేటు ఫైనాన్షియర్ల నుండి తీసుకున్న రుణాల విషయంలో బెదిరింపులు, బలవంతపు వసూళ్ళకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఢిల్లీ, హర్యానాల్లో 10చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ రెండు రాష్ట్రాల్లో పోలీసులు, నిందితులపై నమోదు చేసిన 15కి పైగా ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్‌ల ఆధారంగా దర్యాప్తులు ప్రారంభమయ్యాయి. ఇందర్‌జిత్ సింగ్ యాదవ్ ఆయన అనుచరులు, అపోలో గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఇతర అనుబంధ సంస్థలు, వ్యక్తులకు సంబంధించిన నమోదైన మనీ లాండరింగ్ కేసులో ఇడి ఈ దర్యాప్తు చేపట్టింది. హత్య, బలవంతపు వసూళ్ళు, ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన రుణాల సెటిల్‌మెంట్లు, మోసం, అవినీతి, అక్రమంగా భూ కబ్జాలు వంటి పలు నేరపూరిత కార్యకలాపాల్లో ఇందర్‌జిత్ సింగ్ యాదవ్‌కు ప్రమేయం వుంది. ఇవే కాకుండా అనేక ఇతర కేసుల్లో కూడా హర్యానా పోలీసులు వెతుకుతున్నారు. ప్రస్తుతం పరారీలో వున్న యాదవ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి తన పనులు చక్కబెడుతున్నాడని ఇడి తెలిపింది

## భారీగా తగ్గిన వెండి ధర.. రూ.21వేలు పతనం



**హైదరాబాద్ పెన్ పవర్:** వెండి ధర భారీగా తగ్గింది. ఇప్పటి వరకూ ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన ధరకు బ్రేక్ పడింది. ఫ్యూచర్ మార్కెట్‌లో ఒక్కసారిగా కిందకు పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర గంటలోనే రూ.21 వేలు మేర తగ్గింది. సోమవారం ఇంట్రాడేలో రూ.2,54,174 వద్ద గరిష్టాన్ని తాకిన కిలో వెండి ధర రూ.2,33,120 వద్ద కనిష్టాన్ని తాకింది. అటు స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర దిగి వచ్చింది. రూ.2.50 లక్షలు పైబడి పలికిన కేజీ వెండి ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయానికి రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండికి ఎక్కడా లేని డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా వెండి ఎన్నడూలేని రీతిలో దూసుకెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఒక్కసారిగా ఇటీవల భారీగా దూసుకెళ్లింది. దీంతో సోమవారం ఓ దశలో 80 డాలర్లు పైకెగిసింది. గరిష్టాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది. రష్యా - ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక అడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ పూర్తి సుముఖంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించడం యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాల వేళ వెండి ధర పతమైంది. ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌లను నిర్వహిస్తోంది. 2026 మార్చి ఫ్యూచర్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మార్జిన్‌ను 20వేల డాలర్ల నుంచి 25వేల డాలర్లకు పెంచింది. దీంతో అధిక రిస్క్ తీసుకునే వారు వెనకడుగు వేయడంతో వెండిలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరగడానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

## రెండేళ్ల గరిష్టానికి పారిశ్రామికోత్పత్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి నవంబర్‌లో 6.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది రెండేళ్ల గరిష్ట స్థాయి. మైనింగ్, తయారీ వంటి రంగాల్లో మెరుగైన పనితీరు కారణంగా పారిశ్రామికోత్పత్తి గణనీయంగా పుంజుకుందని జాతీయ గణాంకాల కార్యాలయం(ఎన్ఎస్ఓ) సోమవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5 శాతం పెరిగింది. ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం, సమీక్షించిన నెలలో తయారీ రంగం 8 శాతం పుంజుకుంది. ఇది గతేడాది నవంబర్‌లో 5.5 శాతంగా ఉంది. వర్షాకాలం ముగియడంతో పాటు ఇనుప ఖనిజం వంటి లోహ ఖనిజాల ఉత్పత్తి పెరగడం వల్ల మైనింగ్ ఉత్పత్తి ఈ నవంబర్‌లో 5.4 శాతంగా నమోదైంది. గతేడాది ఇది 1.9 శాతం పెరిగింది. అయితే, విద్యుదుత్పత్తి గత నెలలో 1.5 శాతం క్షీణించింది. గతేడాది ఇది 4.4 శాతం వృద్ధి సాధించింది. మొత్తంగా ఐఐపీ సూచీ పుంజుకోవడం అక్టోబర్‌లో పండుగ సీజన్ కారణంగా నెమ్మదించిన తర్వాత పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడటాన్ని సూచిస్తుందని ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి.

## దేశీయ విమానయాన పరిశ్రమకు రూ. 18,000 కోట్ల నష్టం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమానయాన రంగం భారీ కష్టాలను చూసింది. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో పాటు ఇతర కారణాల వల్ల ఈ రంగం రూ. 17,000-18,000 కోట్ల నష్టాలను చూసే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సోమవారం ప్రకటనలో తెలిపింది. ఇదివరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ రంగం రూ. 9,500-10,500 కోట్ల నష్టం ఎదురవ్వొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేసింది. కానీ, ఇది దాదాపు రెట్టింపునకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 విమాన ప్రమాదం, ఈ నెల ప్రారంభంలో ఇండిగో వేలాది విమానాలను రద్దు చేయడం వంటి అనేక సంక్షోభాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరానికి దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ అంచనాను ఇక్రా 0-3 శాతానికి తగ్గించింది. దీన్ని గతంలో 4-6 శాతంగా అంచనా వేసింది. ఏప్రిల్-నవంబర్ మధ్య ఊహించిన దానికంటే చాలా తక్కువ విమాన ప్రయాణాల రద్దీ ఉందని, ఇందుకు సరిహద్దు ఉద్రిక్తతలు ఎక్కువగా ఉండటమే కారణని ఇక్రా అభిప్రాయపడింది. మరోవైపు ఎక్కువ సంఖ్యలో విమానాల రాకపోకలు అంతరాయం, రద్దు, జూన్‌లో ఎయిర్ఇండియా విమాన ప్రమాం వంటి పరిణామాలు ఎక్కువ ప్రభావితం చేశాయని పేర్కొంది.

## 5జీ నెట్‌వర్క్ సేవల్లో జియో అగ్రస్థానం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటర్నెట్ స్పీడ్, సిగ్నల్ లభ్యత, సబ్‌స్క్రైబర్ల వినియోగానికి సంబంధించి దేశీయ దిగ్గజ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో 5జీ విభాగంలో అగ్రస్థానంలో ఉందని బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ పరిశోధన సంస్థ ఓపెన్ సిగ్నల్ సోమవారం ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 మధ్య సేకరించిన డేటా ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, 4జీ నుంచి 5జీకి మారడం వల్ల డౌన్‌లోడ్ స్పీడ్ అనేక రెట్లు పెరిగిందని, మరింత మెరుగైన ఇంటర్నెట్ లభిస్తున్నట్టు నివేదిక అభిప్రాయపడింది. నివేదిక ప్రకారం, సమీక్షించిన కాలంలో 5జీ డౌన్‌లోడ్ స్పీడ్ సెకనుకు 199.7 మెగాబిట్స్ (ఎంబీపీఎస్)గా ఉంది. ఇది కంపెనీ నెట్‌వర్క్‌లోని 4జీ డౌన్‌లోడ్ వేగం కంటే 11 రెట్లు ఎక్కువ. భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో 5జీ నెట్‌వర్క్ స్పీడ్ 187.2 ఎంబీపీఎస్ ఉండగా, ఇది 4జీ కంటే 7 రెట్లు ఎక్కువగా ఉంది. అయితే వొడాఫోన్ ఐడియా 5జీ నెట్‌వర్క్ 138.1 ఎంబీపీఎస్ డౌన్‌లోడ్ స్పీడ్ నమోదు చేసింది. అన్ని టెలికాం కంపెనీలకు చెందిన 5జీ సబ్‌స్క్రైబర్లు 4జీతో పోలిస్తే తక్కువ నెట్‌వర్క్ అంతరాయాలు, తక్కువ ఇబ్బందిని ఎదుర్కొన్నట్టు చెప్పారు. ఇది 5జీ నెట్‌వర్క్ నాణ్యత కేవలం అధిక స్పీడ్ అందించడమే కాకుండా, మరింత మెరుగైన రోజువారీ నెట్‌వర్క్, ఇంటర్నెట్ అనుభవాన్ని అందించడంలో కూడా ముందుందని నివేదిక పేర్కొంది.

# భారత రక్షణ రంగంలో అదానీ గ్రూప్ భారీ ముందడుగు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ రక్షణ రంగ స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అదానీ గ్రూప్ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. సుమారు రూ. 1.8 లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో రక్షణ ఉత్పత్తుల తయారీలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. వచ్చే ఏడాది నుంచి ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చనున్నాయి, తద్వారా మేక్ ఇన్ ఇండియా నినాదానికి మరింత ఊతం లభించనుంది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో భారత రక్షణ రంగాన్ని నిలబెట్టడమే లక్ష్యంగా ఈ సంస్థ అడుగులు వేస్తోంది.

ముఖ్యంగా భవిష్యత్ యుద్ధ తంత్రాలకు అవసరమైన మానవరహిత విమానాలు, అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్స్ తయారీపై అదానీ గ్రూప్ ప్రత్యేక దృష్టి సారించనుంది. శత్రువుల కదలికలను పసిగట్టే స్మార్ట్ సెన్సార్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్ మరియు ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించే క్షిపణి వ్యవస్థల అభివృద్ధిని వచ్చే ఏడాది నుంచి వేగవంతం చేయనున్నారు. ఈ స్వదేశీ తయారీ వల్ల విదేశీ దిగుమతులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. రక్షణ రంగంలో



ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వల్ల సైన్యానికి అత్యాధునిక ఆయుధాలు త్వరగా అందుబాటులోకి రానున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యుద్ధ సాంకేతికతను ప్రవేశపెట్టడం ఈ భారీ పెట్టుబడుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుల ప్రాణాపాయాన్ని తగ్గించడానికి, మనుషుల ప్రమేయం లేకుండా పోరాడే రోబోటిక్ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ క్షేత్రంలో తలెత్తే క్లిష్ట పరిస్థితులను ాా× ద్వారా విశ్లేషించి, తక్కువ నష్టంతో శత్రువును ఎదుర్కొనేలా సాంకేతికతను తీర్చిదిద్దనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని యుద్ధ తంత్రాలతో జోడించడం వల్ల భారత సైన్యం మరింత పటిష్టం కానుంది. అదానీ గ్రూప్ ఇప్పటికే రక్షణ రంగంలో తన ఉనికిని చాటుకుంటూ కీలక విజయాలను నమోదు చేసింది. ఈ సంస్థ అభివృద్ధి చేసిన 'దృష్టి-10' స్టార్‌లైనర్ వంటి అత్యాధునిక మానవరహిత విమానాలు ప్రస్తుతం భారత నౌకాదళంలో చురుకైన సేవలందిస్తున్నాయి. కేవలం గూఢచర్యానికే కాకుండా, నిఘా మరియు నిరంతర నిఘా కార్యకలాపాల్లో ఇవి అత్యంత కీలకంగా మారాయి. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఉత్పత్తులతో భారత త్రివిధ దళాలకు అండగా నిలవాలని అదానీ గ్రూప్ పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# భారీగా పతనమైన పసిడి ధరలు



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా సామాన్యులకు చుక్కలు చూపిస్తూ, రికార్డు స్థాయి గరిష్టాలను తాకుతూ వచ్చిన బంగారం ధరలు ఒక్కసారిగా కిందికి దిగివచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లలో చోటుచేసుకున్న పరిణామాలతో పాటు, దేశీయంగా డిమాండ్‌లో వచ్చిన మార్పుల వల్ల పసిడి ధరల్లో భారీ కోత విధించబడింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.3,050 తగ్గి, ప్రస్తుతం రూ.1,36,200 వద్ద కొనసాగుతోంది. ఈ భారీ తగ్గుదల పెట్టుబడిదారులను మరియు వివాహాది శుభకార్యాల కోసం బంగారం కొనాలనుకునే వారిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కేవలం స్వచ్ఛమైన బంగారమే కాకుండా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పడిపోయింది. ఈ రకం పసిడిపై 10 గ్రాములకు రూ.2,800 మేర ధర తగ్గడంతో, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1,24,850 పలుకుతోంది. కొద్ది రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన ధరలకు బ్రేక్ పడటంతో పసిడి ప్రేమికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. జ్యువెలరీ షాపుల వద్ద కొనుగోలుదారుల సందడి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారంతో పోటీ పడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిన వెండి ధరలు కూడా ఇవాళ భారీ పతనాన్ని నమోదు చేశాయి. ఒక్క రోజులోనే వెండి ధర కిలోకు ఏకంగా రూ.23,000 తగ్గడం గమనార్హం, దీనితో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,58,000 వద్ద స్థిరపడింది. సాధారణంగా వెండి ధరలు వందల్లో లేదా వెయ్యి రూపాయల లోపు మారుతుంటాయి, కానీ ఇలా వేలల్లో తగ్గడం వెండి మార్కెట్ చరిత్రలో ఒక అరుదైన విషయంగా చెప్పుకోవచ్చు. పారిశ్రామిక అవసరాలకు వెండి డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఈ మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

# సాంకేతిక యుగంలో ఆధ్యాత్మికత..

**హైదరాబాద్ పెన్ పవర్:** మనిషి జీవితం కేవలం భౌతిక సౌకర్యాల సాధనకే పరిమితమైన యాంత్రిక ప్రయాణం కాదనే సత్యాన్ని గుర్తుచేసే దినమే వరల్డ్ స్పిరిట్యువల్ డే. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ప్రపంచ వ్యాప్తంగా ఈ దినాన్ని ఆధ్యాత్మిక చైతన్య దినంగా గుర్తిస్తూ, అంతర్ముఖ పరిశీలనకు, మానవ విలువల పునరుద్ధరణకు పిలుపునిస్తారు. ఒక వైపు విజ్ఞానం, సాంకేతికత అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతున్నా, మరోవైపు మనిషి అంతరంగంలో శాంతి కరువవు తుండటం, నైతిక విలువలు సడలి పోవడం, మానవ సంబంధాలు సంకుచిత మవడం వంటి పరిణామాలు తీవ్రంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యమే వరల్డ్ స్పిరిట్యువల్ డే ప్రాధాన్యతను మరింత పెంచుతోంది. ఆధ్యాత్మికత అనేది మతాచరణకే పరిమితమైన సంకుచిత భావన కాదు. అది మనసు, బుద్ధి, చైతన్యాల మధ్య సమన్వయ సాధన. స్వార్థాన్ని అధిగమించి విశాలమైన దృష్టితో జీవించటం, కరుణ, సహనం, సత్యం, అహింస, సేవ వంటి మానవీయ విలువలను ఆచరణలో పెట్టడమే నిజమైన ఆధ్యాత్మికత. భగవద్గీతలో చెప్పిన కర్మయోగం, ఉపనిషత్తుల్లో ప్రతిపాదించిన ఆత్మజ్ఞానం, బుద్ధుని జ్ఞాన మార్గం, మహావీరుని అహింసా సిద్ధాంతయ ఇవన్నీ మనిషిని అంతర్ముఖంగా మలచే ఆధ్యాత్మిక మార్గాలే. ఇవి కాలాతీత సత్యాలుగా నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. నేటి ప్రపంచం యుద్ధాలు, ఉగ్రవాదం, హింస, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, పెరుగుతున్న మానసిక ఒత్తిడులతో అల్లాడుతోంది. ఈ సమస్యలకు చట్టాలు, పాలసీలు, సాంకేతిక పరిష్కారాలు అవసరమే అయినా, అవి మాత్రమే సరిపోవు. అసలు మార్పు మనిషిలో రావాలి. ఆ మార్పుకు మూలం ఆధ్యాత్మిక చైతన్యమే. వ్యక్తి తనలో తాను మారితేనే సమాజం మారుతుందిబీ సమాజం మారితేనే ప్రపంచం మారుతుంది. ద

ఈ భావనను ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆధ్యాత్మిక సంస్థలు, ధ్యాన కేంద్రాలు, ఆశ్రమాలు వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాయి. ఆధ్యాత్మికత శాస్త్రానికి వ్యతిరేకమన్న అపోహను ఆధునిక పరిశోధనలు పూర్తిగా తొలగించాయి. ధ్యానం, యోగ, మైండ్‌ఫుల్‌నెస్ వంటి సాధనల వల్ల ఒత్తిడి తగ్గడం, ఏకాగ్రత పెరగడం, భావోద్వేగ సమతుల్యత మెరుగు పడడం వంటి ప్రయోజనాలను శాస్త్రం స్పష్టంగా నిరూపిస్తోంది. మానసిక ఆరోగ్యానికి ఆధ్యాత్మిక సాధనలు ఎంతగానో దోహద పడుతున్నాయని వైద్య నిపుణులే చెబుతున్నారు. అంటే ఆధ్యాత్మికత శాస్త్రానికి విరుద్ధం కాదుబీ అది శాస్త్రాన్ని మరింత మానవీయంగా మలిచే శక్తిగా నిలుస్తోంది.

భారతదేశం ఆధ్యాత్మిక వారసత్వానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, భక్తి ఉద్యమం, యోగ సంప్రదాయయఇవన్నీ ప్రపంచానికి భారతదేశం అందించిన అపూర్వమైన ఆధ్యాత్మిక కానుకలు. "వసుధైవ కుటుంబకం" అనే విశ్వ మానవతా సిద్ధాంతం నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైన మార్గదర్శక సూత్రం. జాతి, మతం, దేశ సరిహద్దులను దాటి మానవాళిని ఒక కుటుంబంగా చూడాలన్న ఈ దృష్టికోణం ప్రపంచ శాంతికి మూలాధారం. వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంలో భారతీయ ఆధ్యాత్మిక తత్త్వం ప్రపంచానికి మరింత అవసరమవు తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. యువత ఈ ఆధ్యాత్మిక చైతన్యంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఆధ్యాత్మికత అంటే విరక్తి లేదా లోకత్యాగం కాదని, బాధ్యతతో కూడిన జీవన విధానమని యువత గ్రహించాలి. ఆధ్యాత్మిక విలువలను అలవరచుకున్న యువత వ్యక్తిగత విజయాన్ని మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమర్థంగా నిర్వహించ గలరు. సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాటయఇవన్నీ ఆధ్యాత్మికతకు ఆచరణాత్మక రూపాలే. వరల్డ్ స్పిరిట్యువల్ డేను ధ్యానం, యోగ సాధన, మౌనాచరణ, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సాహిత్య పఠనం, మతాతీత సంభాషణలు, శాంతి సందేశాల ప్రచారం వంటి కార్యక్రమాలతో జరుపుకోవచ్చు. ఇవన్నీ మనిషిని తనలో తాను పరిశీలించు కునేలా చేస్తాయి, కొత్త సంవత్సరాన్ని ఆత్మ పరిశుద్ధితో ఆహ్వానించేందుకు దోహద పడతాయి. మొత్తానికి వరల్డ్ స్పిరిట్యువల్ డే ఒక స్మరణ మాత్రమే కాదుఒక సంకల్పం. భౌతిక అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక పరిపక్వత సాధించినప్పుడే మానవజాతి నిజమైన పురోగతిని అందుకుంటుంది. వ్యక్తి అంతర్ముఖంగా శాంతిని పొందిన నాడే ప్రపంచం బాహ్యంగా శాంతిని పొందగలదు. ఆధ్యాత్మిక చైతన్యమే మానవాళి భవిష్యత్తుకు దీపశిఖగా నిలుస్తుంది.

# జ్ఞానోత్సవం ముగిసింది..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరం మరోసారి పుస్తకాల పండుగతో పులకరించింది. 2025 సంవత్సరంలో మరోసారి పుస్తక ప్రేమికుల రాజధానిగా నిలిచింది. 2025 హైదరాబాద్ బుక్ ఫేర్ విజయవంతంగా ముగిసింది.ఆధునిక సాంకేతిక యుగంలో చదువుకునే అలవాటు తగ్గిపోతుందన్న ఆందోళనల నడుమ, హైదరాబాద్ బుక్ ఫేర్-2025 పుస్తకం ఇంకా జీవంతంగా ఉందని, పాఠకుడితో దాని అనుబంధం చెక్కుచెదర లేదని బలంగా చాటి చెప్పింది. పదిరోజులకు పైగా సాగిన ఈ జ్ఞానోత్సవం వేలాది పాఠకులను, రచయితలను, ప్రచురణ కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ఈ పుస్తక పండుగ నగర సాంస్కృతిక జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచి విజయవంతంగా ముగిసింది. ఈ ఏడాది బుక్ ఫేర్ నిర్వహణకు ముందే విశేష ఆసక్తి నెలకొంది. గత అనుభవాల ఆధారంగా ప్రాంగణాన్ని విస్తరించడం, స్టాళ్ల సంఖ్యను పెంచడం, భద్రతా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఫలితంగా సుమారు 350 నుంచి 380 మధ్యలో స్టాళ్లు ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో మెజారిటీగా తెలుగు పుస్తకాల స్టాళ్లే ఉండటం విశేషం. సుమారు 60 శాతం పైగా స్టాళ్లు తెలుగు ప్రచురణ కర్తలకు కేటాయించ బడటం, తెలుగు పుస్తక మార్కెట్ ఇప్పటికీ బలంగా ఉందన్న వాస్తవాన్ని ప్రతిబింబించింది. ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, తమిళం, కన్నడ భాషల పుస్తకాలూ సముచితంగా దర్శనమిచ్చాయి. ముఖ్యంగా ఉర్దూ-తెలుగు ద్విభాషా పుస్తకాలు, అనువాద గ్రంథాలు ఈసారి ఎక్కువగా కనిపించాయి. పుస్తకాల పరంగా ఈ బుక్ ఫేర్ ఒక విశాలమైన జ్ఞాన ప్రదర్శనగా నిలిచింది. సాహిత్య గ్రంథాలతో పాటు చరిత్ర, రాజకీయాలు, సమాజ శాస్త్రం, ఆర్థికం, తత్వశాస్త్రం, బాల సాహిత్యం, మహిళా అధ్యయనాలు, దళిత-బహుజన రచనలు, జీవిత చరిత్రలు, స్మృతిగ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు పెద్ద సంఖ్యలో విక్రయమయ్యాయి. తెలంగాణ చరిత్ర, స్వరాష్ట్ర ఉద్యమం, భాషా-సాంస్కృతిక వారసత్వంపై వచ్చిన కొత్త పుస్తకాలకు పాఠకులు ప్రత్యేక ఆసక్తి చూపించారు. ప్రచురణకర్తల అంచనాల ప్రకారం ఈసారి బుక్ ఫేర్‌లో సుమారు 12 నుంచి 15 లక్షల పుస్తకాలు విక్రయమైనట్లు తెలుస్తోంది. మొత్తం వ్యాపార పరిమాణం దాదాపు 25 నుంచి 30 కోట్ల రూపాయల వరకు చేరినట్లు అంచనా వేస్తున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 15 నుంచి 20 శాతం వృద్ధిగా భావించవచ్చు. పాఠకుల హాజరు ఈ బుక్ ఫేర్‌కు ప్రధాన బలం. రోజుకు సగటున 50 వేల మందికి పైగా పాఠకులు బుక్ ఫేర్‌ను సందర్శించగా, శని-ఆదివారాల్లో ఈ సంఖ్య లక్షను దాటింది. మొత్తం మీద 8 నుంచి 10 లక్షల మంది పాఠకులు బుక్ ఫేర్‌కు వచ్చారని నిర్వహణ వర్గాలు వెల్లడించాయి. వీరిలో విద్యార్థులు, యువత శాతం గణనీయంగా ఎక్కువ. పాఠశాలలు, కళాశాలలు ప్రత్యేకంగా విద్యార్థులను బుక్ ఫేర్‌కు తీసుకురావడం వల్ల, ఈ పుస్తక పండుగ ఒక విద్యా అనుభవంగా మారింది. పిల్లలు బాల సాహిత్య విభాగాల వద్ద గుమిగూడటం, యువత సమకాలీన రచనలపై ఆసక్తి చూపడం భవిష్యత్ పఠన సంస్కృతికి ఆశాజనక సంకేతంగా నిలిచింది. రచయితల భాగస్వామ్యం ఈ ఏడాది మరింత విస్తృతంగా కనిపించింది. ఈ ఏడాది నిర్వహణలో అనేక సానుకూలాంశాలు కనిపించాయి. ముఖ్యంగా పాఠకుల సంఖ్య గత సంవత్సరాల కంటే పెరగడం గమనార్హం. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావడం పుస్తక సంస్కృతికి శుభ సూచకం. పాఠశాలలు-కళాశాలల నుండి సమూహాలుగా వచ్చిన విద్యార్థులు పుస్తకాల కొనుగోలు, రచయితలతో సంభాషణల ద్వారా జ్ఞానానుభవాన్ని పొందారు. సుమారు 300 మందికి పైగా రచయితలు వివిధ రోజుల్లో బుక్ ఫేర్‌కు హాజరై పాఠకులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. పుస్తకావిష్కరణలు, సంతక కార్యక్రమాలు, చర్చావేదికలు పాఠకులను ఆకట్టుకున్నాయి. సీనియర్ రచయితల అనుభవాలు, కొత్త తరం రచయితల ఆలోచనలు ఒకే వేదికపై కలవడం తెలుగు సాహిత్యానికి కొత్త దిశను సూచించింది. ముఖ్యంగా సమకాలీన సామాజిక సమస్యలు, రాజకీయ పరిణామాలు, భాషా ఉద్యమాలు, మహిళా దృక్కోణాలు వంటి అంశాలపై జరిగిన చర్చలు బుక్ ఫేర్‌ను కేవలం కొనుగోలు కేంద్రంగా కాకుండా ఆలోచనా వేదికగా తీర్చిదిద్దాయి. నిర్వహణ విషయానికి వస్తే, బుక్ ఫేర్ కమిటీ చేసిన కృషి ప్రశంసనీయం. విశాలమైన ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. అయితే, కొన్ని లోపాలు కూడా స్పష్టంగా కనిపించాయి. స్టాళ్ల అమరిక పూర్తిగా వ్యవస్థబద్ధంగా లేకపోవడం వల్ల పాఠకులు కావలసిన ప్రచురణకర్తలను వెతుక్కోవడంలో ఇబ్బంది పడ్డారు. స్పష్టమైన మ్యాప్‌లు, సూచిక బోర్డులు మరింత సమర్థవంతంగా ఏర్పాటు చేసి ఉంటే ఈ సమస్య కొంత మేర తగ్గేదని చెప్పవచ్చు. పార్కింగ్ సదుపాయాల కొరత, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు కొందరు పాఠకులను అసౌకర్యానికి గురి చేశాయి. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లల కోసం మరింత విశ్రాంతి సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ అవసరమన్న అభిప్రాయాలు వినిపించాయి. ధరల అంశం కూడా చర్చకు వచ్చింది. కొంతమంది ప్రచురణకర్తలు 20 నుంచి 50 శాతం వరకు రాయితీలు ఇచ్చి పాఠకులను ఆకర్షించినా, కొన్ని ప్రముఖ పుస్తకాల ధరలు సామాన్య పాఠకులకు భారంగా అనిపించాయి. విద్యార్థుల కోసం ప్రత్యేక రాయితీ కూపన్లు, ప్యాకేజీలు ప్రవేశపెడితే పుస్తకాల విక్రయం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే డిజిటల్ పుస్తకాలు, ఆడియో బుక్స్, ఈ%-%పబ్లిషింగ్‌పై ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఈసారి స్పష్టంగా కనిపించింది. మొత్తంగా హైదరాబాద్ బుక్ ఫేర్%-%2025 పుస్తక సంస్కృతికి ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది. డిజిటల్ మాధ్యమాలు ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకాన్ని చేతిలో పట్టుకుని చదివే అనుభూతికి ప్రత్యామ్నాయం లేదని ఈ బుక్ ఫేర్ మరోసారి నిరూపించింది. పాఠకుడు-రచయిత-ప్రచురణకర్త మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని కల్పించిన ఈ పుస్తక పండుగ, భవిష్యత్తులో మరింత ప్రణాళికాబద్ధంగా, ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటే, దేశంలోనే అగ్రశ్రేణి బుక్ ఫేర్‌లలో ఒకటిగా నిలిచే సామర్థ్యం కలిగి ఉంది. జ్ఞానం, ఆలోచన, సంస్కృతి పునాదులపై నిలిచిన సమాజానికి పుస్తకం ఇప్పటికీ కేంద్ర. బిందువేనన్న సత్యాన్ని హైదరాబాద్ బుక్ ఫేర్%-%2025 గట్టిగా, స్పష్టంగా చాటిచెప్పింది.

# వంట నూనెను పదే పదే వేడి చేసి వాడుతున్నారా?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ ఇళ్లలో వంట నూనె లేని రోజు ఉండదు. పచ్చడి, పులుసు, కూరలు, చిరుతిళ్లు - ఏ వంటకమైనా నూనెతోనే మొదలవుతుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసే పదార్థాల తర్వాత మిగిలిన నూనెను వడకట్టి మళ్లీ వాడేస్తుంటారు చాలా మంది. డబ్బు ఆదా అవుతుందని భావిస్తారు. కాచిన నూనెను మళ్లీ వాడే అలవాటు ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో తెలుసా? పదే పదే వేడి చేసిన నూనెలో విషపదార్థాలు ఏర్పడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి శరీరంలోకి చేరి ఏం చేస్తాయి? ఏ రోగాలకు దారి తీస్తాయి? చాలా మంది ఇళ్లలో డీప్ ఫ్రై చేసిన నూనెను నిల్వ చేసుకుని మరుసటి రోజు కూడా వాడతారు. ఇది సాధారణ అలవాటుగా మారింది. కానీ, ఈ ప్రక్రియలో నూనెలో రసాయన మార్పులు జరుగుతాయి. అధిక ఉష్ణోగ్రతకు గురైన నూనెలో ఫ్రీ రాడికల్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, ఆల్డిహైడ్స్ వంటి హానికర సమ్మేళనాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచి, కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా గుండె జబ్బులు, డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది? మరి ఈ ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవాలి? నూనెను పదే పదే వేడి చేయడం వల్ల దానిలోని కొవ్వు ఆమ్లాలు విచ్ఛిన్నమై ఫ్రీ రాడికల్స్‌ను విడుదల చేస్తాయి. ఈ ఫ్రీ రాడికల్స్ శరీరంలోకి చేరి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి, ట్రైగ్లిజరైడ్స్ స్థాయులను అసమతుల్యం చేస్తాయి. ధమనుల్లో ప్లాక్ పేరుకుపోవడం, వాపులు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం వంటివి జరుగుతాయి. కాలక్రమేణా ఇవి గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తాయి. పరిశోధనల ప్రకారం.. అధిక ఉష్ణోగ్రతలకు గురైన నూనెలో పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్‌వంటి కార్సినోజెన్స్ కూడా ఏర్పడతాయి.వాడిన నూనెను నిల్వ చేసే విధానంలోనూ చాలా మంది తప్పులు చేస్తారు. మూత పెట్టకుండా, వెలుతురు పడే చోట



ఉంచితే ఆక్సీకరణ వేగంగా జరిగి ఫ్రీ రాడికల్స్ మరింతగా పెరుగుతాయి. మళ్లీ వాడాలనుకుంటే తాజా నూనెతో కలిపి వాడవచ్చు కానీ, అందులోని విష సమ్మేళనాలు పూర్తిగా తొలగిపోవు. పొద్దుతిరుగుడు నూనెకు బదులుగా పల్లి నూనె, ఆవ నూనె (మస్టర్డ్ ఆయిల్), కొబ్బరి నూనె, నెయ్యి వంటివి ఉపయోగించండి. ఇవి హై స్మోక్ పాయింట్ ఉండి, డీప్ ఫ్రైకు సురక్షితం. నెలకు ఒకసారి నూనె రకాన్ని మార్చడం వల్ల ఒమెగా-3, ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్ సమతుల్యత కాపాడబడుతుంది. ఈ చిన్న మార్పులతో గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మీ వంటశైలి మార్చుకుంటే.. ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది!

# ఆమ్లెట్, ఉడికించిన గుడ్డు బరువు తగ్గడానికి ఏది మంచిది?





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రోటీన్‌కు గుడ్లు ఉత్తమం. అందుకే డైలీ గుడ్లు తినమని వైద్యులు సూచిస్తారు. అయితే బరువు తగ్గాలనుకునేవారికి ఉడికించిన గుడ్లు, ఆమ్లెట్‌లలో ఏది మంచిదనే సందేహం ఉంటుంది. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఆహారాల్లో గుడ్డుకు సాటిలేదు. అందుకే చాలా మంది తమ అల్పాహారంలో గుడ్లను ఖచ్చితంగా చేర్చుకుంటారు. అయితే గుడ్లను వండుకునే విధానాన్ని బట్టి వాటిలోని పోషకాలు, కేలరీల శాతం మారుతుంటాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఉడికించిన గుడ్డు మంచిదా లేక ఆమ్లెట్ మంచిదా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఆరోగ్యపరంగా చూస్తే ఉడికించిన గుడ్డు అత్యుత్తమ ఎంపిక. దీనిని నూనె లేదా వెన్న లేకుండా కేవలం నీటిలో ఉడికిస్తారు. కాబట్టి అదనపు కొవ్వు చేరే అవకాశం లేదు. ఒక ఉడికించిన గుడ్డులో సుమారు 70 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తూనే బరువును నియంత్రణలో ఉంచుతాయి. ప్రయాణాల్లో కూడా వీటిని సులభంగా తీసుకువెళ్లవచ్చు. ఆమ్లెట్ తినడానికి చాలా రుచిగా ఉంటుంది.. కానీ దీని తయారీ విధానమే పెద్ద మైనస్. ఆమ్లెట్ వేయడానికి నూనె, నెయ్యి లేదా వెన్న వాడటం వల్ల కేలరీల శాతం పెరుగుతుంది. ఉపయోగించే నూనెను బట్టి ఒక ఆమ్లెట్‌లో 90 నుండి 200 కేలరీల వరకు

ఉండే అవకాశం ఉంది. అయితే ఆమ్లెట్‌లో టమోటాలు, ఉల్లిపాయలు, పాలకూర, క్యాప్సికమ్ వంటి కూరగాయలు చేర్చడం వల్ల ఫైబర్, విటమిన్లు అందుతాయి. తక్కువ నూనెతో వేసుకుంటే ఇది కూడా మంచి పోషకాహారమే. బరువును వేగంగా తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు ఉడికించిన గుడ్లు తినడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. ఒకవేళ మీరు ఆమ్లెట్ తినాలనుకుంటే.. నాన్-స్టిక్ పాన్ ఉపయోగించి అతి తక్కువ నూనెతో, ఎక్కువ కూరగాయలు చేర్చి వండుకోవడం మంచిది. దీనివల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది.

# అతిగా తింటే మెదడుకు హాని జరుగుతుందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. సాధారణంగా మనం తినాలనే కోరిక కలిగితే.. అది ఇష్టమైన ఫుడ్ అయితే.. బాగా లాగించేస్తాం.. ఇంకా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలా స్పెషల్‌గా ఫుడ్ రెడీ చేసుకుని ఎంతో ఇష్టంగా తింటాం. ఇలాంటి ఫెస్టివల్ డేస్‌లో చాలామంది ఇష్టమైన డైట్ ప్లాన్‌లన్నీ పక్కనపెట్టి మంచిగా ఫుడ్ లాగిస్తుంటారు. అయితే మనం తీసుకున్న ఆహారం మనం మెదడులో ఎన్నో ముఖ్యమైన పనులు చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో మన మెమరీ పవర్ ఏకాగ్రత వంటి అంశాలు కూడా ఉన్నాయి. సరైన విధంగా పద్ధతిగా తీసుకునే ఆహారం మన మానసిక ఆరోగ్యానికి కూడా సహాయంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. ఇది మన శరీరంలో చక్కర స్థాయిలను నియంత్రిస్తుంది. ఈ సిగ్నల్స్ అన్నీ మన పేగులలోని అన్ని భాగాల నుండి వస్తుంటాయి. పాంక్రియాస్ గ్రంథి ద్వారా విడుదల ఈ హార్మోన్ల నమూనా, వీటి నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు కడుపు నిండిన తర్వాత మనకు కలిగించే నిద్ర మత్తు సంబంధించినవి. కానీ ఖచ్చితంగా ఈ ప్రక్రియ ఎలా పనిచేస్తుంది అనే దానిపై ఇంకా చాలా రీసెర్చ్ చేయాలని వాషింగ్టన్ డిసి లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు తెలిపారు. అయితే ఎక్కువగా తిన్న తర్వాత రక్తప్రసరణ తగ్గదు అని పరిశోధనలు



చెబుతున్నాయి. ఒకేసారి ఎక్కువగా తిన్న కూడా మన మెటబాలిజంపై కాస్త తక్కువ ప్రభావమే పడుతుందని పరిశోధకులు అంటున్నారు. పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రకారం.. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం అందరూ అనుకున్నంత ప్రమాదకరం కాదు అని తెలిపారు. అయితే ఈ అధ్యయనాన్ని కేవలం యువతపైనే, ఆరోగ్యకరమైన వ్యక్తులపైనే చేశామని దీనిపై మరింత పరిశోధన చేయాల్సి ఉందని వారు అంటున్నారు. ఎక్కువగా తినడం వల్ల చెడు ప్రభావం పడుతుందన్న గ్యారెంటీ లేదని పరిశోధకులు తెలిపారు. ఒక్కసారి అత్యధికంగా ఆహారాన్ని తీసుకోవడం వల్ల మన శరీరంపై జరిగే ప్రభావాలపై తక్కువ పరిశోధనలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిశోధనలు మాత్రం మన మెదడుకి అంత ప్రమాదకరం కాదని సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒకసారి ఎక్కువగా తినడం మనం అనుకున్నంత ప్రమాదం కాదని నిపుణులు అంటున్నారు. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం ఓకే కానీ అంతకుమించి తింటే శరీరంపై ఒత్తిడి పెరుగుతుందని.. వరుసగా ఐదు రోజులపాటు ఎక్కువగా తినడం వల్ల మన మెదడుపై దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడేస్తున్నారా.!



**హైదరాబాద్ పెన్ పవర్:** జబ్బు వచ్చింది కదా అని.. ఏది పడితే ఆ యాంటీ బయోటిక్స్ వాడేస్తున్నారా.? సాధారణ ఇన్ఫెక్షన్లకు కూడా యాంటీ బయోటిక్స్ వాడితే లేనిపోని రోగాలు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. మరి అదేంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి ఇక్కడ. యాంటీబయాటిక్స్‌ను అవసరం లేకుండా, డాక్టర్ సూచనలేకుండా వాడుతున్నారా? ఇది అత్యంత ప్రమాదకరమని ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో హెచ్చరించారు. యాంటీబయాటిక్స్ ప్రభావం తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ఐసీయూలో చేరుతున్న అనేక మంది రోగులు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారనీ అన్నారు. అంటే ఏ యాంటీబయాటిక్ కూడా పనిచేయని స్థితి. దీనికి ప్రధాన కారణం యాంటీబయాటిక్స్‌ను ఎడాపెడా వాడటమే అని తెలిపారు. జ్వరం, దగ్గు, విరేచనాలు, కడుపునొప్పి, మూత్రం పోస్తే మంట వంటి సమస్యలు వచ్చిన వెంటనే స్వయంగా యాంటీబయాటిక్స్ తీసుకోవద్దని, తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా స్వయం మందులు వద్దు. డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే యాంటీబయాటిక్స్ వాడాలి" అన్నారు. నీతి అయోగ్? సభ్యుడు డాక్టర్ వీకే పాల్ కూడా ఇదే అన్నారు. యాంటీబయాటిక్స్‌ను అతిగా వాడటం వల్లే యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయాటిక్స్ ప్రతి ఏడాది లక్షలాది ప్రాణాలను కాపాడుతున్నాయి. కానీ అవసరం లేని సందర్భాల్లో వాడితే ప్రమాదకరంగా మారతాయనీ చెప్పారు. యాంటీబయాటిక్స్ ప్రాణాంతక ఇన్ఫెక్షన్లపై పని చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. డాక్టర్లు కూడా బాధ్యతగా ప్రామాణిక మార్గదర్శకాల ప్రకారం మాత్రమే యాంటీబయాటిక్స్ సూచించాలని అన్నారు. మొత్తానికి యాంటీబయాటిక్స్‌ను సరైన సమయంలో, సరైన మోతాదులో, డాక్టర్ సూచనలతో మాత్రమే వాడితేనే అవి ప్రాణాలను కాపాడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స దొరకని ప్రమాదం ఉందని స్పష్టం చేసారు.

## ఒక కప్పు కాఫీ పిల్లలకు ఎంత ప్రమాదకరమో..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉదయం, సాయంత్రం సమయాల్లో టీ, కాఫీలు తాగడం సాధారణమే. కొంత అనారోగ్యకరమైన వీటిని సేవించడం వల్ల పెద్దలపై తక్కువ చెడు ప్రభావమే ఉంటుంది. కానీ, పిల్లల్లో టీ, కాఫీలు సేవించడం వల్ల చాలా దుష్ప్రభావాలు చూపుతాయి. పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. పిల్లల మెదడు అభివృద్ధికి టీ, కాఫీలు చాలా హాని చేస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం లేచిన తర్వాత, సాయంత్రంపూట చాలా మంది టీ లేదా కాఫీ సేవిస్తుంటారు. ఇది కొంత వరకు అనారోగ్య కారణమని తెలిసినా వాటిని సేవించకుండా ఉండలేరు. అయితే, పిల్లలకు మాత్రం టీ, కాఫీలు చాలా హాని కారకమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాఫీ తాగితే పిల్లలకు తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఐరన్ లోపానికి దారి: పిల్లలు అంటే ఎదిగేదశలో ఉన్నవారు. మనం వారి కోసం ప్రతిరోజూ పోషకాలు కలిగిన కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు లాంటి పదార్థాలను అందించాలి. కానీ, తిన్న తర్వాత ఒక కప్పు టీ గానీ, కాఫీ గానీ తాగితే.. ఆ ఆహారంలోని పోషకాలు ఏవీ శరీరానికి అందవు. వీటిలో ఉండే కొన్ని రసాయనాలు తినే ఆహారంలోని ఐరన్ రక్తంలోకి శోషించకుండా నిరోధిస్తాయి. ఫలితంగా పిల్లలు ఎంత తిన్నా.. వారు సన్నగానే ఉంటారు. రక్తహీనత ఏర్పడుతుంది. ఎప్పుడూ అలసిపోయినట్లుగా కనిపిస్తుంటారు.వివిధ పనుల్లో బిజీగా ఉండే పెద్దలు ఉపశమనం కోసం కాఫీ లేదా టీ తాగుతుంటారు. కానీ, పిల్లలకు కాఫీ, టీలలో ఉండే కెఫిన్.. నాడీ వ్యవస్థను అతిగా ప్రేరేపిస్తుంది. దీంతో వారిలో కొంత ఆందోళన ఏర్పడుతుంది. చదువు దృష్టి పెట్టలేరు, ఒక చోట కుదురుగా కూర్చోలేరు. అంతేగాక, ఈ కెఫిన్ వారి నిద్రను పూర్తిగా చెడగొడుతుంది. రాత్రిపూట టీ తాగే పిల్లలకు గాఢ నిద్ర రాదు. దీంతో వారి ప్రవర్తనలో మార్పులు వస్తాయి. మరుసటి రోజు ఉదయం లేవగానే చిరాకుగా ఉంటారు. చాలా మంది తల్లులు తమ పిల్లలు ఉదయం ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదని ఫిర్యాదు చేస్తుంటారు. దీనికి ప్రధాన కారణం ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో తాగే టీ లేదా కాఫీనే. ఇది ఆకలిని ప్రేరేపించే హార్మోన్లను అణిచివేస్తుంది. అంతేగాక, ప్రేగులలో యాసిడిటీని పెంచుతుంది. గుండెలో మంట, మలబద్ధకం, కడుపు సమస్యలను కలిగిస్తుంది. ఆకలి లేకపోతే పిల్లలు తినరు. తినకపోతే వారిలో ఎదుగుదల ఉండదు. తాగే కాఫీలో చక్కెర కూడా ఉంటుంది. అది అధిక స్థాయిలో ఉండటం కూడా పిల్లలకు హాని చేస్తుంది. పిల్లల దంతాలు పుచ్చిపోయే ప్రమాదం ఉంది. కేలరీలను పెంచి ఊబకాయులను కూడా చేసే అవకాశం ఉంది. పదేళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలకు పాలు, పోషక విలువలు కలిగిన గంజి లేదా పండ్ల రసాలు ఇవ్వడం చాలా మంచిది. పిల్లలు మారాం చేస్తున్నారు కదా అని టీ, కాఫీ లాంటివి తాగిస్తే వారిని ప్రమాదంలో పడేసినట్లే అవుతుంది. పిల్లల మెదడు అభివృద్ధి, శారీరక ఆరోగ్యం దెబ్బతీసినవారు అవుతారు. అధికంగా చక్కెర తీసుకుంటే పిల్లలు హైపర్ యాక్టివ్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

# చలికాలంలో ఇడ్లీ పిండి పులియట్లేదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా మందికి ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కింద ఇడ్లీ తినడం అలవాటు. కానీ ఇడ్లీ పిండి సరిగ్గా పులియబెడితేనే ఇడ్లీ మృదువుగా మారుతుంది. శీతాకాలం కాబట్టి ఇడ్లీ పిండి త్వరగా పులియదు. శీతాకాలంలో ఇడ్లీ పిండి పులియబెట్టడానికి ఏమి చేయాలో ఇక్కడ కొన్ని ప్రత్యేక చిట్కాలను నిపుణులు సూచిస్తున్నారు. ఇండ్లీ పిండి తయారు చేసిన తర్వాత పిండిని గ్యాస్ దగ్గర, ఫ్రిజ్ పైన లేదా వంటగదిలో ఏదైనా వెచ్చని ప్రదేశంలో ఉంచండి. మీకు ఓవెన్ ఉంటే, లైట్ ఆన్ చేసి లోపల ఉంచండి. కానీ ఓవెన్ వేడి చేయకూడదు. గోరువెచ్చని నీటిని వాడవచ్చు. పిండిని నానబెట్టేటప్పుడు లేదా రుబ్బేటప్పుడు కొద్దిగా గోరువెచ్చని నీటిని వాడటం వల్ల కిణ్వ ప్రక్రియకు సహాయపడుతుంది. వెంటనే ఉప్పు వేయకూడదు. రుబ్బిన తర్వాత పిండిని కొద్దిసేపు పులియనివ్వాలి. ఆ తరువాత ఉప్పు వేయాలి. త్వరగా ఉప్పు వేయడం వల్ల కిణ్వ ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొంచెం పోహా లేదా వండిన అన్నం కూడా వేయవచ్చు. గ్రైండ్ చేస్తున్నప్పుడు 2-3 టేబుల్ స్పూన్ల మందపాటి పోహా లేదా కొద్దిగా వండిన బియ్యం అన్నం వేస్తే కిణ్వ ప్రక్రియ బాగా జరుగుతుంది. పిండిని

మరీ మెత్తగా చేయకుండా పిండిని కొద్దిగా మందంగా ఉంచండి. పలుచగా ఉండే పిండి త్వరగా పులియదు. మీ దగ్గర పాత పులియబెట్టిన పిండి ఉంటే మీరు దానిని కూడా ఉపయోగించవచ్చు. 1-2 టేబుల్ స్పూన్ల పాత పులియబెట్టిన ఇడ్లీ పిండిని కొత్త పిండితో కలపండి. అయితే పాన్ మూత ప్రతిసారీ తెరిచి చూసుకుంటూ ఉండకూడదు. శీతాకాలంలో పిండిని పులియబెట్టడానికి 12-18 గంటలు పట్టవచ్చు. అందుకే తొందరపడకండి. ఇంకా పులియకపోతే 1 టీస్పూన్ చక్కెర కలిపి 2-3 గంటలు వెచ్చని ప్రదేశంలో ఉంచండి. లేదా 1-2 టీస్పూన్ల పాత పులియబెట్టిన పిండిని జోడించండి. ఇలా చేయడం వల్ల ఇడ్లీ పిండి త్వరగా పులుస్తాయి. ఇడ్లీలు కూడా మృదువుగా ఉంటాయి.

# 2026 T20 ప్రపంచ కప్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన.. డేంజరస్ బౌలర్ రీ ఎంట్రీ




**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్: 2026 టీ20 వరల్డ్ కప్ కోసం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన జట్టును మంగళవారం (డిసెంబర్ 30) ఈసీబీ అనౌన్స్ చేసింది. యంగ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యాషెస్ సిరీస్‌లో గాయపడ్డ డేంజరస్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వరల్డ్ కప్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

మెగా టోర్నీ ప్రారంభ సమయానికి ఒకవేళ ఆర్చర్ కోలుకోకపోతే అతడి స్థానంలో బ్రైడాన్ కార్స్ బరిలోకి దిగనున్నాడు. ఇక, తన కెరీర్‌లో ఇంగ్లాండ్ తరపున ఒక్క వైట్-బాల్ మ్యాచ్ కూడా ఆడని పేసర్ జోష్ టంగ్ అనుహ్యంగా టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో ప్రదర్శన ఆధారంగా టంగ్ టీ20 జట్టుకు ఎంపికయ్యాడు.

2026 టీ20 వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంకలు సంయుక్తంగా అతిథ్యమిస్తున్నాయి. 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ మెగా టోర్నీకి ఫిబ్రవరి 7న పాకిస్తాన్ – నెదర్లాండ్ మ్యాచ్‌తో తెరలేవనుంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత రసవత్తరంగా, ఫ్యాన్స్ థ్రిల్లింగ్?గా ఫీలయ్యే ఇండియా-పాక్ జట్ల మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా(USA), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి.ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి

ఇంగ్లాండ్ టీ20 ప్రపంచ కప్ జట్టుహ్యారీ బ్రూక్ (సి), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, బ్రైడాన్ కార్స్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్

# హైదరాబాద్‌కు ఏమైంది..? విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా మూడో ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాటర్లు రాణించి భారీ స్కోరు చేసినా విజయ్ హజారే వన్డే ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా మూడో ఓటమిని ఎదుర్కొంది. సోమవారం జరిగిన గ్రూప్-బి పోరులో అస్సాం 4 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలిచింది. తొలుత రాహుల్ సింగ్ (79), అభిరత్ రెడ్డి (54), నితేష్ రెడ్డి (53) హాఫ్‌సెంచరీలతో రాణించడంతో హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 310/8 స్కోరు చేసింది. అస్సాం బౌలర్లలో అబ్దుల్ అజీజ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేజింగ్‌లో అస్సాం 49.3 ఓవర్లలో 314/6 స్కోరు చేసి గెలిచింది. ఆ టీమ్ ప్లేయర్ శివ్ శంకర్ రాయ్ (112) సెంచరీతో సత్తా చాటాడు. కెప్టెన్ సీవీ మిలింద్ మూడు వికెట్లు తీసినా మిగతా బౌలర్లు ఫెయిలయ్యారు. బుధవారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో బరోడాతో హైదరాబాద్ పోటీపడనుంది.

# మలింగకు కీలక బాధ్యతలు అప్పగించిన శ్రీలంక క్రికెట్ బోర్డు

- శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా మాజీ పేసర్ మలింగ నియామకం
- టీ20 ప్రపంచకప్ కోసం లంక పేసర్లకు ప్రత్యేక శిక్షణ
- నెల రోజుల పాటు సేవలు అందించనున్న మలింగ
- భారత్, శ్రీలంక వేదికగా త్వరలో జరగనున్న మెగా టోర్నీ
- మలింగ అపార అనుభవం జట్టుకు కలిసొస్తుందన్న శ్రీలంక బోర్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహాల్లో భాగంగా శ్రీలంక క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పేస్ దిగ్గజం, యార్కర్ స్పెషలిస్ట్ లసిత్ మలింగను జాతీయ జట్టుకు 'ఫాస్ట్ బౌలింగ్ సలహాదారు'గా నియమించింది. ఈ మెగా టోర్నీకి భారత్‌తో పాటు శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో, తమ బౌలింగ్ దళాన్ని పటిష్టం చేసేందుకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. మలింగ నియామకం స్వల్పకాలిక ప్రాతిపదికన జరిగింది. దాదాపు నెల రోజుల పాటు మలింగ ఈ బాధ్యతల్లో కొనసాగుతాడని ఎస్ఎల్‌సీ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ సమయంలో మలింగ తన అపార అనుభవంతో జాతీయ ఫాస్ట్ బౌలర్లకు మెరుగులు దిద్దనున్నాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన 'డెత్ బౌలింగ్' (చివరి ఓవర్లు) వేయడంలో పేసర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో మలింగకు ఘనమైన రికార్డు ఉంది. 30 టెస్టులు, 226 వన్డేలు, 84 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఈ వెర్సటైల్ పేసర్.. ఆయా ఫార్మాట్లలో వరుసగా 101, 338, 107 వికెట్లు పడగొట్టాడు. 2014లో శ్రీలంక టీ20 ప్రపంచకప్ గెలవడంలో మలింగ కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లలో ఆడిన అనుభవం అతడి సొంతం. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. స్వదేశంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీ కోసం శ్రీలంక జట్టును సన్నద్ధం చేయడంలో మలింగ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని బోర్డు ఆశిస్తోంది.

# కింగ్100లో కూలీ లుక్ లో నాగ్

అక్కినేని నాగేశ్వరరావు కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున ఆ తర్వాత తనదైన స్టైల్ లో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాలు మాత్రమే కాకుండా అన్ని రకాల జానర్లలోనూ నాగ్ తనదైన ముద్ర వేసి స్టార్ హీరోగా ఎదిగారు. అలాంటి నాగ్ ఇప్పుడు తన కెరీర్లో మైల్ స్టోన్ ఫిల్మ్ అయిన 100వ సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

**100వ సినిమా కోసం నాగ్ స్పెషల్ కేర్**

వాస్తవానికి నా సామిరంగ సినిమా తర్వాత నాగ్ వెంటనే తన 100వ సినిమాను చేయాల్సింది కానీ 100వ ప్రాజెక్టు కాబట్టి కాస్త జాగ్రత్త తీసుకునే నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. అందుకని నాగ్ ఈ గ్యాప్ లో ఖాళీగా లేరు. ఈ గ్యాప్ లో నాగ్ వేరే హీరోల సినిమాల్లో కీలక పాత్ర చేయడం, విలన్ గా కనిపించడం, బిగ్ బాస్ లాంటివి చేస్తూ ఆడియన్స్ కు అందుబాటులోనే ఉన్నారు.

**కుబేర, కూలీ తో ఆకట్టుకున్న నాగ్**

రీసెంట్ గా కుబేర, కూలీ సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించిన నాగ్, తన 100వ సినిమా విషయంలో చాలా ప్లాన్డ్ గా ఉన్నారు. ఈ మైల్ స్టోన్ ఫిల్మ్ కు కోలీవుడ్ డైరెక్టర్ రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఈ మూవీ షూటింగ్ పై ఓ అప్డేట్ తెలుస్తోంది.

**కేరళలో కింగ్100**

కింగ్100 వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ మూవీ నెక్ట్స్ షెడ్యూల్ కేరళలో ఉంటుందని సమాచారం. రీసెంట్ గా వచ్చిన కూలీ సినిమాలో నాగ్ ఎలాంటి హెయిర్ స్టైల్ తో అయితే కనిపించారో ఇప్పుడీ సినిమాలో కూడా అదే హెయిర్ స్టైల్ తో కనిపించనున్నారని తెలుస్తోంది. కాగా ఈ మూవీకి లాటరీ కింగ్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారట. మరి ఈ సినిమా ఏ జానర్ లో రానుంది? మిగిలిన విషయాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.



ప్రిషా రాజేష్ సింగ్ ఎరుపు రంగు చీరలో బీచ్ సైడ్ గ్లామర్ తో అదరగొట్టింది





ఆంచల్ ముంజాల్ హాయిగా గళ్ల చొక్కా దుస్తులలో సంవత్సరాంతపు చలిని ఆస్వాదిస్తోంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965